epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19  సంచిక : 59 | 10-05-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12  వెల : రూ.1.00




# పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు

- సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి
- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్

2లో



ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు.





## బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

- ఆయనతో పాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం
- ప్రమాణం చేయించి గవర్నర్ ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సిఎంలు హాజరు



పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్ కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన హాజరయ్యారు.

వార్త 2లో

## నేడు ప్రధాని మోడీ రాక

**నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు**

హైదరాబాద్,

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్



గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించ నున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు.

## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమి లేదు
- కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం
- బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు.



2



2

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనట్లు వార్తలు వచ్చిన విషయంపై మాజీహోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. 17 సంవత్సరాల బాలికకు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేయించడంతో పేట్ బషీరాబాద్‌లో కేసు నమోదైనట్లు సమాచారం.

## బిజెపి దాడికి నిరసనగా బంద్

**బిఆర్ఎస్ పిలుపుతో స్వచ్ఛందంగా మద్దతు**

కరీంనగర్, అక్షరకలం ప్రతినిధి

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బీజేపీ దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఇచ్చిన బంద్ కొనసాగుతోంది. నగరంలోని వ్యాపార, వాణిజ్య సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. బంద్ నేపథ్యంలో రోడ్లపైకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్క అరెస్టు చేసి టీటీసీకి తరలించారు. శనివారం ఉదయం నుంచే గంగుల కమలాకర్ ఇంటి వద్ద మోహరించిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ మేయర్ రవీందర్ సింగ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులను అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బంద్‌లో పాల్గొనేందుకు గంగాధర మండలం బూరుగుపల్లి నుంచి బయల్దేరిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మార్గమధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయన్ను అదుపులోకి తీసుకుని బూరుగుపల్లిలోని నివాసానికి తరలించి హౌస్ అరెస్టు చేశారు. ఇక కరీంనగర్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది.

## బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

**అశేషంగా హాజరైన ప్రజలకు అభివాదం**

కోల్‌కతా, అక్షరకలం ప్రతినిధి

పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు. బెంగాల్‌లో బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించి ఏకంగా ముఖ్యమంత్రి అయిపోయారు.

# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

**ఆయనతో పాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం**

**ప్రమాణం చేయించి గవర్నర్ ఆర్ఎన్ రవి**

**హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు**

**చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సీఎంలు హాజరు**









**కోల్‌కతా,**

పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహితుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో



చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

# పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు



**సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి**

**రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్**

**పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళు_న్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా





విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యుఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

**అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు**

**కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం**

**బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు**

**సిద్దిపేట,**

కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024-25 బ్జడెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బ్జడెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనులకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు.

## బండి తనయుడు భగీరథ్‌పై ఫోక్సో కేసు

**మైనార్ బాలికపై అత్యాచరం జరిపినట్లు ఫిర్యాదు**

**హైదరాబాద్,**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ భారతీయ జనతా పార్టీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

**సిఎం చేతిలో హోం ఉన్నా సమీక్షలు లేవు**

**చట్టం ఎవరికైనా ఒక్కటిగానే ఉండాలి**

**బండి భగీరథ్ కేసు నేపథ్యంలో సబిత వ్యాఖ్యలు**

**హైదరాబాద్,**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనట్లు వార్తలు వచ్చిన విషయంపై మాజీహోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. 17 సంవత్సరాల బాలికకు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేయించడంతో పేట్‌బషీరాబాద్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలంగాణ పోలీస్ అంటే దేశంలో మొదటి స్థానంలో దక్షిణాది రాష్ట్రాల్లో కూడా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాంటి పోలీసులు ఈ రోజు దేశంలోనే వెనకడుగు వేస్తున్న రాష్ట్రంలో తెలంగాన ఉందంటే బాధ అనిపిస్తుంది. ఆందోళన కూడా కనిపిస్తుంది.. ప్రభుత్వాలు మారుతుంటాయి. దాంతోపాటు ప్రాధాన్యాతలు కూడా మారుతాయి. కానీ ప్రాథమిక బాధ్యత అయిన శాంతిభద్రతలు విస్మరిస్తే రాష్ట్రమే అధోగతి పాలవుతుందని అనడానికి ఈ రెండున్నర సంవత్సరాలు ఉదాహరణన్నారు.. మన రాష్ట్రంలో శాంతి భద్రతలు అనగానే రాజకీయ వేధింపులు, ప్రతిపక్షంలో ఉన్నవారిని ట్రాప్ చేయడం తప్పితే ఏం జరగుతుంది రాష్ట్రంలో అనేదానిపై రివ్యూ చేసుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. తెలంగాణ సాధించుకున్నమంటే ఏదో భౌగోళికంగా సాధించుకున్నది కాదు. ప్రశాంతమైన వాతావరణం ఉండాలి.. పెట్టుబడులు వెల్లువలా రావాలి. ఈ రాష్ట్రంలో ఉన్న యువత అందరికీ ఉపాధి దొరకాలినే ఆలోచనతో ఈ రాష్ట్రాన్ని సాధించుకున్నం అని అన్నారు. ఈాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వానికి ఉందని విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా హోంమంత్రి దగ్గరకు పరెగెత్తేవాళ్లు. రాష్ట్రంలో హోంమంత్రి లేరు. ఎందుకంటే ముఖ్యమంత్రే హోం మంత్రి. కానీ ఒక్కోసారి ఆ బాధ్యతను విస్మరించాలరేమో అనిపిస్తుంటుంది. ఎప్పుడు వెళ్లినా ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో సమీక్ష చేస్తున్నారని ఎప్పుడూ వింటుంటాం. ఏం సమీక్ష చేస్తున్నారని.. అనుకుంటే ఒక హోంశాఖ తప్ప మిగితా అన్ని సమీక్షలు జరుగుతంటాయి. కానీ కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని హోంశాఖను సమీక్షించాలన్న ఆలోచన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి లేదని చెప్పుకోవాల్సి రావడం బాధాకరమైన విషయమన్నారు. కేంద్రమంత్రి కొడుకా.. వేరే వ్యక్తి కొడుకా అని కాదు.. తప్పు చేసినప్పుడు సామాన్యుడికి ఏ చట్టం ఉంటుందో ఆయనకు కూడా అదేచట్టం ఉండాలే. ఎవరైతే కంప్లెయింట్ ఇచ్చారో దాన్ని రిసీవ్ చేసుకోవాలె. కచ్చితంగా పోక్సో కేసు పెట్టాల్సిందే. ఎందుకంటే రిపోర్ట్ తీసుకుంటే ఆ అమ్మాయి 17 ఏండ్లు అని విన్నా. కాబట్టి పెట్టాల్సిందే. కేసు రిజిస్టర్ చేయాల్సిందే. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందని సబిత అన్నారు.



# ప్రపంచంలో సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలు ఇవే!

**పర్యటనలే మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి. 'ఓ ఏడాది గడిచిపోయే సరికి ఇంతకుముందు చూడని ప్రదేశానికి వెళ్లిరావాలి' అంటారు బౌద్ధ గురువు దలైలామా. ఇంటినుంచి అడుగు బయట పెట్టకపోతే మాత్రం ఉన్నచోటనే ఉండిపోతాం. అదే కొత్త ప్రదేశాలను చుట్టేసి వస్తే కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకుంటాం. మనసు విశాలమవుతుంది. ఇలాంటి దర్శనీయ స్థలాలు ప్రపంచంలో చాలానే ఉంటాయి. వాటిలోంచి ఈ ఏడాది సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలను సిఫారసు చేస్తున్నారు పర్యాటక నిపుణులు. మనం ఎంచుకునే చోటును బట్టి, మన జీవనశైలిని బట్టి వ్యయాలు మారుతూ ఉంటాయి. శ్రీలంక రాజధాని కొలంబో సమీపంలోని సముద్రతీర నగరం నెగొంబో. బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనే ఉంటుంది. సముద్రపు కయ్య (లగూన్)ను అనుసరించుకుని ఉన్న నెగొంబో శ్రీలంకలో పురాతనమైన చేపల పరిశ్రమకు నెలవైన నగరం. ఇక్కడి బీచ్ ప్రశాంతంగా ఉంటుంది.**

సముద్రం మీద మత్స్యకారులు చేపల్ని వేటాడే దృశ్యాలు కట్టిపడేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సముద్రంలో మునిగిపోయిన బ్రిటిష్ సరుకు రవాణా విమానాన్ని చూడటానికి డైవింగ్ సదుపాయం ఉంటుంది. తీర ప్రాంతంలో మడ అడవులు ప్రత్యేక ఆకర్షణ. వీటిని చూడటానికి పడవ సదుపాయం ఉంది. అలా వెళ్తూ వెళ్తూ నీటి ఉడుములు, వలస పక్షులను చూసి పరవశించిపోవచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్నేశ్వరం దేవాలయం, స్థానికంగా ఉండే చేపల మార్కెట్ కూడా దర్శనీయమే. ఇక్కడి పెద్దపెద్ద హోటళ్లు విండ్ సర్ఫింగ్, సెయిలింగ్, స్కీయింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తుండటం విశేషం.

## కోహ్ కేర్, కాంబోడియా

కాంబోడియా దేశంలోని పవిత్ర నగరం. నాలుగున్నర చదరపు మైళ్ల విస్తీర్ణంలో నెలకొన్న దేవాలయాల సముదాయమే కోహ్ కేర్. ప్రసాత్ థామ్ అనే ఏడంతస్తుల పిరమిడ్ ఇక్కడి ప్రసిద్ధ నిర్మాణం. రకరకాల శిల్పాలు, రాతి చెక్కడాలు, కొలనులు, పురాతన నిర్మాణాలతో పెనవేసుకుని భారీగా పెరిగిపోయిన చెట్లు ప్రధాన ఆకర్షణ. దగ్గరి విమానాశ్రయం సియెమ్ రీప్.

## ముస్తాంగ్, నేపాల్

నేపాల్ హిమాలయ దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ముస్తాంగ్ ప్రాంతం చూపు తిప్పుకోనివ్వని అన్నపూర్ణ, ధవళగిరి హిమగిరులు, పర్వతాల మధ్య మలుపులు తిరుగుతూ లోయల్లో హొయలొలికే నదులు, మంచుకొండల నుంచి నెమ్మదిగా జాలువారుతున్న హిమనదాలు, ఎత్తుపల్లాలతో కూడుకున్న లోయలు, జడలబర్రెలు, గొర్రెలతో ముస్తాంగ్ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మనదేశానికి పొరుగునే ఉండే నేపాల్‌లో పర్యటన సులభమే.

## అల్మాటీ, కజక్‌స్తాన్

మధ్య ఆసియా దేశం కజక్‌స్తాన్‌లో అతిపెద్ద నగరం. పురాతనమైన సిల్క్‌రోడ్‌లో వెలసిన అల్మాటీ కజక్‌స్తాన్‌లో అత్యంత అందమైన నగరం. ట్రాన్స్ ఇలి ఆల్టాయ్ పర్వతాల నేపథ్యంతో ఉండే అల్మాటీ మంచి ప్రణాళికతో, దారికి రెండువైపులా చెట్లతో కూడిన రోడ్లు, లెక్కలేనన్ని పార్కులు, తోటలతో సందర్శకులకు మధురానుభూతులను అందిస్తుంది. ఇక్కడి అసెన్షన్ కేథడ్రెల్ ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన కొయ్య కట్టడం. దీన్ని 1907లో నిర్మించారు.

## డొమినికా

కరీబియన్ దీవుల్లో కొలువైన 750 చదరపు కిలోమీటర్ల దేశం డొమినికా. అగ్నిపర్వతాలు, ఉష్ణమండల వర్షారణ్యాలు, అంతెత్తునుంచి జాలువారే జలపాతాలు ఇక్కడి ఆకర్షణ. అందుకే దీన్ని 'ప్రకృతి ద్వీపం' (నేచర్ ఐలాండ్) అని పిలుచుకుంటారు. దట్టమైన అడవులు, అందమైన రోజో లోయ, దాదాపు 200 అడుగుల వెడల్పుతో.. పొగలుకక్కుతూ మరిగే నీటి సరస్సు సందర్శనీయ స్థలాలు.

## మసా అండ్ కరారా, ఇటలీ

కళా ప్రేమికులకు స్వర్గధామం ఇటలీలోని మసా అండ్ కరారా ప్రావిన్స్. మన హిమాలయాలను తలపించే అపువన్ ఆల్ప్స్ పర్వతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ప్రపంచ ప్రసిద్ధ పాలరాతి గనులు ఇక్కడే ఉన్నాయి. మైఖేలాంజెలో రూపొందించిన సుప్రసిద్ధ శిల్పం డేవిడ్ ఇక్కడి పాలరాతితో తీర్చిదిద్దిందే. రోడ్డు వారగా శిల్పుల ఉలి సవ్వళ్లు వినిపించడం మసా అండ్ కరారా విలక్షణత. ఆల్ప్స్ పర్వతాలకు తోడు మధ్యధరా సముద్రతీర బీచ్‌లు, భారీతనం ఉట్టిపడే క్రైస్తవ కేథడ్రెల్‌లు, మధ్యయుగాల ఐరోపా చరిత్రను గుర్తుకుతెచ్చే కోటలకు మసా అండ్ కరారా పెట్టింది పేరు.

## లద్దాక్, భారత్

హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ కనుమ మీదుగా అటల్ టన్నెల్ గుండా సాగిపోతే కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ చేరుకుంటాం. ఆకాశాన్ని అందుకునే హిమాలయాలు, పాతాళాన్ని తాకే పర్వత లోయలు, సింధు, ష్యోక్ నదుల ఒయ్యారపు మలుపులు, బౌద్ధ మఠాలు, జడలబర్రెలు, కొండగొర్రెలు, నల్లమెడ కొంగలు, స్వచ్ఛమైన సరస్సులు లద్దాక్ ఆకర్షణలు. ఇక్కడి పెద్ద పట్టణమైన లేహ్‌లో మార్కెట్లు, మ్యూజియంలు, తొమ్మిది అంతస్తుల రాజభవనం చూడదగిన ప్రదేశాలు.



## బ్రెసీలియా, బ్రెజిల్

దక్షిణ అమెరికా ఖండంలో పెద్దదేశం బ్రెజిల్ రాజధాని నగరం బ్రెసీలియా. ప్రణాళికా బద్ధంగా నిర్మించిన ఈ నగరం అధునాతనమైన తెల్లటి భవంతులకు తార్కాణం. బ్రెజిల్ దేశపు అధ్యక్షుడి నివాసం పలాసియో డ అల్వొరడా కొత్త రూపాన్ని సంతరించుకుని ఈ ఏడాది మళ్లీ ప్రారంభం కానుంది. ఆధునిక నగర ప్రణాళికకు నమూనాగా నిలిచే బ్రెసీలియా నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చోటు దక్కింది.

## యమగూచి, జపాన్

స్వచ్ఛమైన ఉద్యానవనాలు, ఐదు అంతస్తుల రూరికోజీ ఆలయ పగోడాకు ప్రసిద్ధి చెందిన నగరం యమగూచి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన బౌద్ధ మందిరం రూరికోజి పగోడాను జపాన్ జాతీయ సంపదల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఇక నగరంలోని మలుపులు మలుపుల వీధులు యుద్ధ వ్యూహాన్ని అనుభూతికి తెస్తాయి.

## న్యూజిలాండ్

దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా ఉన్న దేశం



న్యూజిలాండ్. ఉత్తర, దక్షిణ న్యూజిలాండ్ ప్రధాన దీవులు కాగా, చిన్నచిన్న దీవులు అనేకం ఉన్నాయి. క్రియాశీల అగ్నిపర్వతాలు, చూపు తిప్పుకోనివ్వని గుహలు, హిమనదాలతో ఏర్పడిన లోతైన సరస్సులు, అందమైన లోయలు, పొడవైన బీచ్‌లు, మంచుతో కప్పి ఉండే ఎత్తయిన పర్వతాలకు నిలయం ఈ దేశం. కివీ పక్షులు మరో ఆకర్షణ. న్యూజిలాండ్‌ను రోడ్డు ద్వారా వెళ్తూ చూడాలని పర్యాటకులు కోరుకుంటారు. కానీ రైలులో చుట్టేయడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇలా న్యూజిలాండ్‌ను తిరగడానికి 17 రోజులు పడుతుంది.

మావుయీ, అమెరికా

అమెరికాకు చెందిన హవాయి దీవుల్లో భాగమే ఈ మావుయీ ద్వీపం. పసిఫిక్ మహాసముద్రం ఓ వైపు.. కాలుష్యం జాడలు లేని స్వచ్ఛమైన బీచ్‌లు, కొబ్బరిచెట్లు, ఎత్తయిన పర్వతాలతో కూడిన 700 చదరపు కిలోమీటర్ల ద్వీపం ఇది. హాలియాకలా నేషనల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణ. ఇక కామావుల్ స్టేట్ బీచ్‌లో ముఖానికి స్నార్కెల్ పెట్టుకొని సముద్ర గర్భాన్ని చూస్తూ ఈదులాడొచ్చు. బీచ్‌లో సేదదీరుతూ సముద్ర తాబేళ్లను చూస్తూ అవ్యక్తమైన ఆనందానుభూతికి లోనుకావొచ్చు.

## మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్ఫియర్ రిజర్వ్, మెక్సికో

ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో సుమారు 1,40,000 ఎకరాల్లో విస్తరించిన అటవీ ప్రాంతం.. మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్ఫియర్ రిజర్వ్. శిశిరం వచ్చిందంటే సరి.. బహుదూరాల నుంచి వలసవచ్చిన కోట్లాది మోనార్క్ జాతి సీతాకోకచిలుకలు ఈ పార్కులో సందడిచేస్తాయి. ఈ వలస కాలంలోనే సీతాకోకచిలుకలు నాలుగు తరాలు పుట్టి మరణిస్తాయట. యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ బయోస్ఫియర్ రిజర్వ్ మెక్సికో నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

## తెస్సాలోనికి, గ్రీస్

గ్రీస్ దేశంలో ఏజియన్ సముద్ర తీరంలో ఉన్న ఈ నగరం పర్యాటక ప్రియులు అత్యధికంగా తరలివచ్చే ప్రదేశాల్లో ఒకటిగా ప్రసిద్ధిచెందింది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో 'గ్రీకువీరుడు' అలెగ్జాండర్ ద గ్రేట్ సోదరి తెస్సాలోనికె పేరుమీదుగా ఆమె భర్త కసాండర్ ఆఫ్ మాసిడోన్ స్థాపించాడు. ప్రాచీన గ్రీకుల కాలపు కట్టడాలు, బైజాంటైన్ సామ్రాజ్యం మొజాయిక్ చిత్రాలు, ఒట్టోమాన్ తురుష్కుల కాలపు కట్టడాలతో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక లక్షణాలతో అలరారుతున్న నగరం తెస్సాలోనికి.

## సింగపూర్

ఆసియా ఖండానికి చెందిన నగర దేశం సింగపూర్ నిజంగానే పర్యాటకుల స్వర్గధామం. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే మలక్కా జలసంధి ప్రాంతంలో భూమధ్య రేఖ సమీపంలో నెలకొన్న సింగపూర్‌లో%ా% మెరీనా బే బీచ్ ఇసుకతిన్నెలు, కళ్లు చెదరగొట్టే ఉద్యానవనాలు, కోలాహలంగా ఉండే ఆర్చర్డ్ రోడ్, మండాయ్ అభయారణ్యంలోని పక్షుల పార్కు, పులావు సెంటోసా ద్వీపాలు, సింగపూర్ నేషనల్ మ్యూజియం, ప్రపంచంలోనే అత్యంత అరుదైన మాంగ్రూవ్ అడవులకు నిలయమైన సుంగేయి బులోహ్ వెట్‌లాండ్ అభయారణ్యం ప్రధాన సందర్శన స్థలాలు.

## జెనీవా, స్విట్జర్లాండ్

ప్రకృతి అందాల దేశం స్విట్జర్లాండ్‌లో రెండో పెద్ద నగరం జెనీవా. అనేక అంతర్జాతీయ సంస్థలు ఈ నగరం కేంద్రంగా పనిచేస్తున్నాయి. చాక్లెట్లు, గడియారాలకు జెనీవా ప్రసిద్ధి. ఇక్కడ జెట్ డిఈఎయూ ఫౌంటెయిన్, పూల గడియారం ఎల్‌హోర్లోగ్ ఫ్లూరీ, సెయింట్ పియర్ కేథడ్రెల్, ప్లేస్ డ్యు బోర్గ్‌డిఫోర్ తదితర ప్రదేశాలు దర్శనీయాలు. ఇక్కడికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీఈఆర్‌ఎన్ పరిశోధన కేంద్రం ప్రధాన ఆకర్షణ.

## పారిస్, ఫ్రాన్స్

ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్ ఫ్యాషన్‌కు, ఈఫిల్ టవర్‌కు పేరుగాంచింది. 2024 ఒలింపిక్స్, పారాలింపిక్ ఆటలపోటీలకు ఈ నగరం ఆతిథ్యం ఇస్తున్నది. ఈఫిల్ టవర్‌తోపాటు నోటర్ డామ్ కేథడ్రెల్, లోవర్ మ్యూజియం, ఢిల్లీలోని ఇండియా గేట్‌ను పోలినఆర్క్ ఆఫ్ ట్రయంఫ్, వర్సెయిల్స్ రాజభవనం, డిస్నీలాండ్ చూడదగ్గ స్థలాలు. సీన్ నదిపై నౌకా విహారం అదనపు ఆకర్షణ.

## బ్రూనీ ఐలాండ్, ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా టాస్మేనియా రాష్ట్రంలో పసిఫిక్ మహాసముద్రంలో నెలవైన ద్వీపం బ్రూనీ ఐలాండ్. ఉత్తర, దక్షిణ బ్రూనీ భూభాగాలను కలిపే ఇరుకైన భూసంధి ఇక్కడి ప్రధాన ఆకర్షణ. కుడిఎడమలుగా విస్తరించిన సముద్రం మధ్య రోడ్డు ప్రయాణం ఓ వర్ణించలేని అనుభూతి. ఈ ద్వీపాన్ని మొదటగా 1642లో నెదర్లాండ్స్ నావికుడు ఏబెల్ టాస్మాన్ గుర్తించాడు. గార్డెన్ సీడ్ బ్యాంక్‌లో విత్తనాలు సేకరించవచ్చు. దీనికోసం టాస్మేనియన్ వాకింగ్ కంపెనీ, రాయల్ టాస్మేనియన్ బొటానికల్ గార్డెన్ ఉమ్మడిగా వృక్షశాస్త్ర విజ్ఞానం పెంచుకునేందుకు మూడు రోజుల ట్రెకింగ్ సదుపాయం కల్పించాయి.

## లేక్ టోబా, ఇండోనేషియా

ఇండోనేషియా దేశం సుమత్రాలో 1,707 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించిన అగ్నిపర్వత సరస్సు లేక్ టోబా. సరస్సు మధ్యలో



పులావు సామోసిర్ ద్వీపం ఉంటుంది. సుమారు 70,000 సంవత్సరాల కింద అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల ఈ సరస్సు ఏర్పడింది. పులావు సామోసిర్ బతక్ తెగ ఆదివాసుల సాంస్కృతిక కేంద్రం. కొన్ని రోజులపాటు అడవిలో అలా ప్రశాంతంగా తిరిగి రావాలనుకునే వారికి గొప్ప పర్యాటక ప్రదేశం లేక్ టోబా. అయితే, సరస్సులో నీటి నాణ్యత ఒక్కో దగ్గర ఒకోలా ఉంటుంది. స్థానికులను అడిగి అనువైన చోట మాత్రమే లోపలికి అడుగుపెట్టాలి. ఈ సరస్సులోని నీరు అసహన్ నది గుండా మలక్కా జలసంధిలో కలిసిపోతుంది.

## సావో నేషనల్ పార్క్, కెన్యా

ఆఫ్రికా ఖండ దేశం కెన్యాలో 22,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిన అభయారణ్యం సావో నేషనల్ పార్క్. ప్రపంచంలో అతిపెద్ద జాతీయ ఉద్యానవనాల్లో ఇది ఒకటి. ఆఫ్రికా ఏనుగులు, సింహాలు, వివిధ రకాల కోతులు, అడవి దున్నలు, ఖడ్గమృగాలు, నీటి ఏనుగులు, హార్టెబీస్ట్ అనే జింకలు, జిరాఫీలు, జీబ్రాలు, వందలాది పక్షిజాతులతో సావో నేషనల్ పార్క్ సందర్శకులకు కనువిందు చేస్తుంది.

## పాసాడెనా, అమెరికా

కాలిఫోర్నియా రాష్ట్రంలో లాస్ ఏంజెల్స్ కౌంటీలో కొలువైన నగరం పాసాడెనా. సెయింట్ గాబ్రియెల్ పర్వతాల నేపథ్యంతో ఈ నగరం చూడముచ్చటగా ఉంటుంది. దీన్ని 1874లో థామస్ బి. ఇలియట్ స్థాపించాడు. పాసాడెనా అంటే 'లోయకు కిరీటం' అని అర్థం. చుట్టుపక్కల ఉన్న జలపాతాలు, ఏంజెలిస్ నేషనల్ పార్కు పాసాడెనాకు ప్రత్యేక ఆకర్షణలు.

## బాజ్ ఎన్‌వావ్‌జో ఇటా కుక్వేని, అమెరికా

అరిజోనా రాష్ట్రంలో భౌగోళిక అద్భుతం గ్రాండ్ కాన్యాన్ పరిసరాల్లో నెలకొంది. దీన్ని గత ఏడాది ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ స్మారకంగా ప్రకటించారు. తొమ్మిది లక్షల ఎకరాల్లో విస్తరించిన బాజ్ ఎన్‌వావ్‌జో పీఠభూములు, కాన్యాన్లు, ఇతర భౌగోళిక అద్భుతాలతో వావ్ అనిపిస్తుంది. 3,000 వరకు సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న స్థలాలు దీని సొంతం. ఆధ్యాత్మికంగానూ ప్రాధాన్యం కలిగిందే. సిందూరపు రంగు పర్వత భాగాలు, ఇతర వన్యప్రాణులు కనువిందు చేస్తాయి.

## వాలెన్షియా, స్పెయిన్

స్పెయిన్‌లో మధ్యధరా సముద్ర తీరంలో నెలకొన్న నగరం. 2,100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన నగరం వాలెన్షియా. ద సిటీ ఆఫ్ హండ్రెడ్ బెల్ టవర్స్ అని ఈ నగరానికి మారుపేరు. ఈ స్తంభాలలో మిగులెటె టవర్, టవర్ ఆఫ్ సాంటా కాటలినా ప్రసిద్ధిచెందినవి. నగరం మధ్యలో ఉన్న లా సియో కేథడ్రెల్ కూడా సందర్శనీయ స్థలమే. మధ్యయుగాలకు చెందిన వాలెన్షియా రాజుల కట్టడాలు ఆశ్చర్యపరుస్తాయి. ఎన్నో ఉద్యానవనాలు, ఆర్ట్ మ్యూజియంలు, సిరామిక్స్‌కు వాలెన్షియా పెట్టిందిపేరు. కన్ను ఆకారంలో ఉండే ఎల్‌హెమిస్‌ఫెరిక్, నీళ్లలో ఉండే ఎల్‌ఓషనోగ్రఫిక్ సిటీ కూడా చూడదగినవే. నడుస్తూనే వాలెన్షియాను చుట్టేయవచ్చు.

## సాలార్ డి ఉయుని, బొలీవియా


దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో ఆండీస్ పర్వతాల్లో 12,000 అడుగుల ఎత్తులో నెలకొన్న ఉప్పు నీటి సరస్సు సాలార్ డి ఉయుని. ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌కు గురయ్యే ప్రమాదం పొంచి ఉన్న సాలార్ డి ఉయునికి ప్రయాణించడం సాహసమే. పురాతన సరస్సులు ఎండిపోవడంతో కేవలం లవణాలు మాత్రమే మిగిలిపోయిన నేల ఇది. 10,000 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన తెల్లటి ఉప్పునేల మీద సర్‌సర్‌మని మన అడుగుల సవ్వడి తప్ప మరే శబ్దం వినిపించదు.

## ఔరికా లోయ, మొరాకో

మధ్యధరా, అట్లాంటిక్ మహాసముద్రాల్ని ఆనుకుని ఉన్న మొరాకో దేశంలో అట్లాస్ పర్వతాలు ఉన్నాయి. వీటిలోభాగమే ఔరికా లోయ. ఎత్తయిన అట్లాస్ పర్వతాల మధ్య మలుపులు తిరిగే ఔరికా నది వల్లే ఈ ప్రాంతానికి ఈ పేరు. సెట్టి %-% ఫత్మా అనే గ్రామం దగ్గర్లో.. ఏడు జలపాతాల కలయికగా ఔరికా జలపాతాలు ఉంటాయి. సంప్రదాయ అమాజిగ్ ఇండ్లు కూడా సందర్శనీయ స్థలాలే.

## క్రేటర్స్ ఆఫ్ మూన్, అమెరికా

అమెరికాలోని ఇడాహో రాష్ట్రంలో అగ్నిపర్వత పేలుళ్లు, లావా ప్రవాహం వల్ల ప్రత్యేకతను సంతరించుకున్న ప్రాంతం. దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో విస్తరించిన క్రేటర్స్ ఆఫ్ మూన్‌ను అమెరికా ప్రభుత్వం 1924లో జాతీయ ప్రాధాన్యంగల ప్రాంతంగా ప్రకటించింది. అగ్నిపర్వత పేలుళ్ల వల్ల ఏర్పడిన ఎగుడు దిగుళ్లతో ఈ ప్రాంతం అచ్చంగా చందమామ ఉపరితలాన్ని గుర్తుకుతెస్తుంది. అందుకే 'క్రేటర్స్ ఆఫ్ మూన్' అని పేరుపెట్టారు. లావా ప్రవాహం గడ్డకట్టి ఉంటుంది కాబట్టి, ఇక్కడ వృక్షాలు అంతగా కనిపించవు. వర్షపాతం కూడా తక్కువే. అయినా, లావాతో గట్టిపడిన పగుళ్లలో నీళ్లు నిల్వ ఉంటాయి. స్నేక్ నది ఈ ప్రాంతం గుండా ప్రవహిస్తుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మ్యాజిక్ ఫిగర్ లేకపోవడం గవర్నర్ తప్పా ?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టాలు, శాసనసభ, లోక్‌సభ అంటే తెలియని వారంతా..ఇప్పుడు చట్టసభలకు ఎన్నికవుతున్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఉన్న వెసలుబాటు కారణంగా ఎవ్వరైనా చట్టసభలకు ఎన్నిక కావచ్చు. ఎన్నికయ్యాక అయినా చట్టాలు, రాజ్యాంగ గురించి తెలుసుకుంటే బాగుండేది. కానీ అలా జరగడం లేదు. డబ్బులు, పలుకుబడి, మందబలం ఉంటే ప్రజాప్రతినిధులు అవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఏమీ తెలియకుండా బయట ఉండేవారు చట్టాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడేస్తున్నారు. తమిళనాడు విషయంలో ఇదే జరుగుతోంది. టివికె పార్టీ పార్టీ పెట్టి,108 సీట్లు నెగ్గి, అత్యధిక మెజార్టీ సీట్లతో విజయ్ ముందున్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు ఉండాలి. కేవలం అందరికన్నా మెజార్టీ సాధిస్తే లేదా అతిపెద్ద పార్టీగా అవతరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రూల్ ఏమీ లేదు. 118 సీట్లకు సంబంధించి మద్దతు పత్రాలను సమర్పించాలని గవర్నర్ విశ్వనాథ్ కర్లేకర్ కోరడంలో కూడా వింతేమీ లేదు. మద్దతు ఉందని తెలిస్తే తప్పకుండా ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాల్సిందే. అలా కాకుండా అతిపెద్ద పార్టీగా గెలిచాం కనుక ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలని గవర్నర్‌ను డిమాండ్ చేయడం సరికాదు. అలాగే గవర్నర్‌ను నిందించడం అంతకన్నా సరికాదు. అందుకే చట్టం, రాజ్యాగం తెలియని నటులు ప్రకాశ్ రాజ్, విశాల్, కాంగ్రెస్ నేతలు గవర్నర్ తీరును తప్పు పడుతున్నారు. వీరంతా బిజెపి వ్యతిరేకులు కనుక గవర్నర్‌ను తప్పు పడుతున్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇలా మద్దతు ఉన్నా లేకున్నా ప్రభుత్వాల ఏర్పాటుకు పిలిచి, బొక్కబోర్లా పడ్డ సంఘటనలు ఉన్నాయి. అలాగే హార్స్ ట్రేడింగ్ జరగడం చూశాం. కాబట్టి గవర్నర్ అనుసరించిన విధానమే రాజ్యాంగబద్దం. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు రోజులు కావస్తున్నా.. వ్యవహారం ముందుకు కదలడం లేదు. టివికె అధినేత విజయ్‌కు మద్దతు ఇచ్చే వారు లేఖలు సమర్పించి ఉంటే ఈ పంచాయితీ రాదు. తమిళనాడు రాజకీయం రసకందాయంలో పడడానికి హంగ్ ఏర్పడడమే ప్రధాన కారణం. అలాగే గట్టిగా ఏ ఒక్క పార్టీ కూడా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించలేదు. ఐదు సీట్లు కాంగ్రెస్ మాత్రమే ప్రకటించింది. అదికూడా మద్దతు లేఖ సమర్పించలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ, కూటమికి మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన ఏర్పడింది. దీనికి గవర్నర్ తప్పు కాదు.ఆయన బిజెపి మనిషి కనుక ఇలా చేశారని అనేవాళ్లు మూర్ఖులు తప్ప మరొకరు కాదు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో సినీ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో గెలిచి మెజారిటీకి కాస్తా దూరంలో నిలిచి పోయారు. స్టాలిన్ నాయకత్వం లోని డీఎంకే కూటమి 73 స్థానాలకు పరిమితం కాగా, పళనిస్వామి నేతృత్వంలోని అన్నా డీఎంకే కూటమి 53 స్థానాలు గెలుచుకున్నది. ఈ మూడింటిలో ఏవో రెండు పార్టీలు కలిస్తే తప్ప ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం లేదు. ఎవరికి వారే భీష్మించుకొని కూర్చోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆగిపోయింది. గవర్నర్‌ను విజయ్ సంప్రదించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించా లంటే మ్యాజిక్ ఫిగర్ సభ్యుల మద్దతు తప్పనిసరి అని గవర్నర్ స్పష్టంచేశారు. దీంతో తమిళనాడులో సీఎం పీఠం ఎవరిది అనే తీవ్ర ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొన్నది. బీహార్‌లో 2005 ఎన్నికల్లో జేడీయూ, ఆర్జేడీ, ఎల్‌జేపీలో ఏ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన నెలకొన్నది. తాము ఎవరికీ మద్దతిచ్చేది లేదని మూడు పార్టీల నేతలు భీష్మించుకున్నారు. విధి లేని పరిస్థితుల్లో గవర్నర్ బూటాసింగ్ రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. అసెంబ్లీ రద్దు చేశారు. వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. ప్రతిష్టంభన పేరుతో అసెంబ్లీని రద్దు చేయడం అప్రజాస్వామికమని సుప్రీంకోర్టు తప్పుపట్టింది కానీ అప్పటికే రద్దయిన అసెంబ్లీ పునరుద్ధరించలేదు. ఆరునెలలకే అసెంబ్లీ ఎన్నికలు జరిగి జేడీయూ అధికారంలోకి వచ్చింది. సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం గవర్నర్ తొలుత మెజారిటీ సాధించిన పార్టీకి లేదా ప్రీపోల్ సంకీర్ణానికి అవకాశం ఇవ్వాలి. లేదా ఎన్నికల తర్వాత ఏర్పడ్డ సంకీర్ణానికి అవకాశం ఇచ్చి బలపరీక్షకు పురమాయిం చాలి. సర్వసాధారణంగా జరుగుతున్న తంతు ఇదే. ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాని సందర్భంలో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆహ్వానించ వచ్చునా లేదా అన్న విషయంలో మాత్రం గవర్నర్లు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. అలా తీసుకున్న సందర్భం లో విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఇలా గోవా, కర్నాటక, మహారాష్ట్రల్లో తలబొప్పి కట్టిన సంఘటనలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 నిబంధన ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులను నియమిస్తారు. గవర్నర్ అభీష్టం ఉన్నంతకాలం వారు పదవిలో ఉంటారు. ఈ మేరకు గవర్నర్‌లు అంతా ఒకే రీతిన వ్యవహరించారు. కానీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే ముందుగా ఎవరిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలన్న విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. అక్కడే గవర్నర్ల విచక్షణాధికారం చట్టాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు చూశాం. రాజకీయ నేతలను గవర్నర్లుగా నియమించడం మొదలయ్యాక విచక్షణాధికారం ఆయా పార్టీల విధానాలకు అనుగుణంగా మారింది. ఇలాంటి దుష్ట సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టింది. బిజెపి కొనసాగిస్తోంది. అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలా వద్దా అనే విషయంలో ఒక స్పష్టత ఇస్తే తమిళనాడు వంటి వివాదాలు భవిష్యత్తులో తలెత్తవు. ఆ దిశగా కేంద్రం రాజ్యాంగ సవరణ చేస్తే మరీ మంచిది. డీఎంకే, అన్నాడీఎంకే కూటములు ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాని నేపథ్యంలో విజయ్‌కి గవర్నర్ అవకాశం ఇస్తే పెద్దగా అభ్యంతరాలు ఎందుకని చాలామంది ప్రశ్నిస్తున్నారు. కానీ ఇక్కడా గవర్నర్ తన పరిధి మేరకు, రాజ్యాంగ బద్దంగానే మద్దతు లేఖలు కోరారు. అందులో తప్పుకూడా లేదు. తన బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని అడగడంతోనే అక్కడ మెలిక ఉంది. అధికారంలోకి వచ్చిన తరవాత ఓ పదిమంది ఎమ్మెల్యేలను కొనడం



సులువు. అలాంటి ఉదాహరణలు కోకొల్లలు. కాబట్టి హార్స్ ట్రేడింగ్‌కు అవకాశం లేకుండా, నడుచుకోవాలన్న గవర్నర్ నిర్ణయం సమర్థనీయం. అన్నా డీఎంకే, డీఎంకేల్లో ఒకరు మద్దతిస్తే విజయ్ ముఖ్యమంత్రి కావచ్చు. లేదా డీఎంకే, అన్నా డీఎంకే కూటములు కలిస్తే కాంగ్రెస్, బీజేపీ సహకారం లేకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే 121 సీట్ల బలం వారికి ఉన్నది. ఈ క్రమంలో గవర్నర్‌ను విమర్శించే వారు చట్టాలను, రాజ్యాంగాన్ని తెలుసుకుంటే మంచిది. మరీ ముఖ్యంగా సినిమా నటులకు ఇది వర్తిస్తుంది.

# నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్ ) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డి తో కలిసి జహీరాబాద్ రెవెన్యు డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను



పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక



సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు.ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముందస్తు నిర్ధారణ పరీక్షలతోనే క్షయ నివారణ సాధ్యం...

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్



రాయికల్ మే 9 (అక్షర కలం)

ముందస్తు నిర్ధారణ పరీక్షలతో క్షయ వ్యాధి నివారణ సాధ్యమవుతుంది అని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ అన్నారు.. రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలోనీ ఇటుక బట్టి, కోళ్ళ ఫాంలో పనిచేసే కార్మికులకు శనివారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి లేకపోవడం, దగ్గు, బరువు తగ్గడం, రాత్రి జ్వరం తదితర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలనీ అన్నారు..క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా పరీక్షలు, మందులు అందజేస్తామన్నారు..ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఇల్లెందుల శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కడకుంట్ల భూమయ్య, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్ ,ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి**

**అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి**


**-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల మే 9 (అక్షర కలం)

జిల్లాలోని ధర్మపురి మండలం పెద్ద నక్కల పేట, దోనూరు, తిమ్మాపూర్, వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను శనివారం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో మరియు జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున



వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్ఫలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలు ఉన్నందున ఉరుములు మెరుపులతో కూడుకున్న వర్షాలు కురిస్తే రైతులు చెట్ల కింద, కరెంటు పోల్స్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని అన్నారు.ఈ పరిశీలనలో మండల తహసిల్దార్లు , సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారిపై భారీగా గంజాయి పట్టివేత

కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద లారీలో తరలిస్తుండగా పోలీసుల దాడి



అక్షర కలం : నకిరేకల్ నియోజకవర్గం

నల్గొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలో శనివారం భారీ మొత్తంలో గంజాయి పట్టుబడింది. పోలీసుల అప్రమత్తతతో అక్రమంగా తరలిస్తున్న ఈ మాదకద్రవ్యాల గుట్టు రట్టయింది. ?శనివారం ఉదయం కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద కేతేపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒక లారీ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు దానిని ఆపి సోదా చేశారు. లారీలో తనిఖీ చేయగా భారీగా గంజాయి నిల్వలు బయటపడ్డాయి. దీంతో వెంటనే పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. ఈ తనిఖీలకు సంబంధించి కేతేపల్లి ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాజానికి, ముఖ్యంగా యువత భవిష్యత్తుకు పెద్ద శాపమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, గంజాయి ఎక్కడి నుండి ఎక్కడికి తరలిస్తున్నారు ? దీని వెనుక ఉన్న ముఠా ఎవరు ? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్ఐ సతీష్ ప్రజలను కోరారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 09:


జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మంచిర్యాల నియోజకవర్గ స్థాయి సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి వ్యవసాయ శాఖ అధికారులు, తహశీల్దార్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు, ఐకెపి సభ్యులతో వరి ధాన్యం కొనుగోలు, తరలింపు, లారీలు, హమాలీ ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ స్వయం సహాయక సంఘాలకు ఇవ్వడం జరిగిందని, ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు



పర్యవేక్షించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల వద్ద గల ధాన్యంను నిబంధనల ప్రకారం పరిశీలించి నాణ్యత, తేమ శాతం, రైతులకు టోకెన్ అందించాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి కొనుగోలు ప్రక్రియ అనంతరం గోదాములకు, రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని, జిల్లాలో చేపట్టిన వారి ధాన్యం సాగులో దాదాపు 65 శాతం మంచిర్యాల నియోజకవర్గంలో జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 12 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారం వచ్చిన లారీలను రోజుకు కనీసం 10 లారీలకు తగ్గకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో దాన్యం నిల్వ చేసేందుకు 6 గోదాములు అందుబాటులో ఉన్నాయని, జైపూర్ లోని సుముఖ గోదాములో 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేయవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో 11 మెట్రిక్ టన్నుల నుండి 12 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. మే చివరి వరకు వీలైనంత ధాన్యం కొనుగోలు చేయాలని, 80 శాతం దాన్యం కొనుగోలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# రూ.27 కోట్లకు రిషభ్ పంత్‌కు సంబంధం లేదు

ఐపీఎల్ 2026 సీజన్‌లో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌కు ఆ జట్టు హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్ అండగా నిలిచాడు. అతని ప్రైజ్ ట్యాగ్‌తో ఆటను పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో రిషభ్ పంత్ 9 ఇన్నింగ్స్‌ల్లో 128.30 స్ట్రైక్‌రేట్‌తో 204 పరుగులు మాత్రమే చేశాడు. కెప్టెన్‌గానూ అతను రాణించలేకపోతున్నాడు. దాంతో లక్నో 9 మ్యాచ్‌ల్లో 7 పరాజయాలతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆల్‌టైమ్ రికార్డ్ ధర రూ.27 కోట్లతో లక్నోలోకి వచ్చిన రిషభ్ పంత్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. కానీ ఐపీఎల్ 2025 సీజన్‌తో పాటు తాజా సీజన్‌లోనూ పంత్ తీవ్రంగా నిరాశపర్చాడు. అటు కెప్టెన్సీతో పాటు ఇటు బ్యాటర్‌గా విఫలమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో పంత్ 14 మ్యాచ్‌ల్లో 260 పరుగులే చేశాడు. ఈ క్రమంలోనే రిషభ్ పంత్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించాలని మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు. జస్టిన్ లాంగర్ మాత్రం రిషభ్ పంత్ తమ కెప్టెన్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశాడు. కెప్టెన్సీ అనేది చాలా కఠినమైదని, ఎంతో ఒత్తిడిని తట్టుకోవాల్సి ఉంటుందని లాంగర్ పేర్కొన్నాడు. 'నిజాయితీగా చెప్పాలంటే పంత్ ప్రదర్శనకు డబ్బుతో ఏ మాత్రం సంబంధం లేదని నా అభిప్రాయం. సారథ్యం అనేది ఒక కఠినమైన బాధ్యత. ఎంతో ఒత్తిడిని మోయాల్సి ఉంటుంది. ఆ విషయం పంత్‌కు బాగా తెలుసు. జట్టు కోసం అతను ఎంతో ఒత్తిడిని భరిస్తున్నాడు. మా అందరిలాగే 98 శాతం సమయం అతను చిరునవ్వుతోనే ఆ బాధ్యతను నిర్వర్తిస్తాడు. మిగిలిన 2 శాతం సమయం మాత్రం పరిస్థితి కాస్త కఠినంగా ఉంటుంది. అయినప్పటికీ పంత్ తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఈ సీజన్ ఆరంభంలోనే జట్టుకు విజయాన్ని అందించే ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతను నవ్వుతూ తనదైన శైలిలో దూకుడుగా ఆడినప్పుడు మాకు ఎంతో సంతోషంగా అనిపిస్తుంది. ఆ స్థాయి ప్రదర్శనకు అతను ఎంతో దూరంలో లేడు. ఇటీవల ప్రాక్టీస్ మ్యాచ్‌లో 30 బంతుల్లోనే 95 పరుగులు చేశాడు.

# 'చెన్నై' గూటికి ముంబై కెప్టెన్..?

చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓటమి పాలైన తర్వాత, మైదానంలో ఒక ఆసక్తికర దృశ్యం కనిపించింది. సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్, హార్దిక్ పాండ్యా చాలా సేపు సీరియస్‌గా చర్చించుకున్నారు. ముంబై ఇండియన్స్ ఈ సీజన్ (2026)లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 7 ఓడిపోయి పీకల్లోతు కష్టాల్లో ఉంది. ఇలాంటి సమయంలో ప్రత్యర్థి జట్టు బాస్‌తో హార్దిక్ చర్చలు జరపడం ట్రేడింగ్ రూమర్లకు ఆజ్యం పోసింది. గతంలో సంజూ శామ్సన్ కూడా ఇలాగే కాశీ విశ్వనాథన్‌తో మాట్లాడటం, ఆ తర్వాత ఆయన సీఎస్‌కేలోకి రావడం గమనార్హం. రోహిత్ శర్మను తప్పించి హార్దిక్‌కు కెప్టెన్సీ ఇవ్వడంపై ముంబై అభిమానులు ఇప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీనికి తోడు జట్టు వరుస వైఫల్యాలు హార్దిక్‌ను మరింత ఇరకాటంలో పడేశాయి. ప్రముఖ వ్యాఖ్యాత సైమన్ డౌల్ సైతం హార్దిక్‌ను ముంబై వదిలేయడమే మంచిదని అభిప్రాయపడ్డారు. వరుసగా రెండు సీజన్లలో జట్టు విఫలమయ్యాక, కెప్టెన్సీ నుంచి తప్పించి అతడిని జట్టులో ఉంచడం హార్దిక్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని డౌల్ పేర్కొన్నారు. ఒకవేళ ఐపీఎల్ 2027 వేలానికి ముందే హార్దిక్ పాండ్యాను సీఎస్‌కే ట్రేడ్ చేసుకోవాలనుకుంటే, కింది మూడు అవకాశాలు ఉండే ఛాన్స్ ఉంది:హార్దిక్, శివమ్ దూబే ఇద్దరూ టీమ్ ఇండియాలో కీలక ఆల్‌రౌండర్లు. అయితే దూబే గత రెండు సీజన్లుగా ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. ముంబైకి చెందిన దూబేను ముంబై ఇండియన్స్‌కు ఇచ్చి, హార్దిక్‌ను చెన్నై తీసుకోవచ్చు. అయితే వీరిద్దరి ధరల మధ్య వ్యత్యాసం ఉన్నందున, అదనంగా నాథన్ ఎల్లిస్ వంటి ఆటగాడిని కూడా ముంబైకి ఇచ్చే అవకాశం ఉంది.సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మహారాష్ట్రకు చెందిన ఆటగాడు. ముంబై పరిస్థితులపై అతనికి పూర్తి అవగాహన ఉంది. ఒకవేళ నాయకత్వ మార్పు కోరుకుంటే, హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా తీసుకుని గైక్వాడ్‌ను ముంబైకి పంపే సాహసం సీఎస్‌కే చేయవచ్చు. గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబైకి హార్దిక్ వచ్చినట్లుగానే, ఎలాంటి ఆటగాళ్లను మార్చుకోకుండా కేవలం నగదు రూపంలో కూడా ఈ ఒప్పందం జరగవచ్చు. దీనికోసం ముంబై తన భారీ ధర కలిగిన ఆటగాళ్లను వదిలించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి ఇవన్నీ కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలే. అటు ముంబై ఇండియన్స్ కానీ, ఇటు సీఎస్‌కే కానీ దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. హార్దిక్ పాండ్యా, కాశీ విశ్వనాథన్ మధ్య జరిగిన సంభాషణ కేవలం మర్యాదపూర్వకమైనది కూడా కావచ్చు. కానీ ఐపీఎల్ చరిత్రలో ఇలాంటి చిన్న చర్చలే పెద్ద మార్పులకు దారితీశాయి.




# పాండ్యా భవితవ్యంపై చర్చ..!?

ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు 2024లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు హార్దిక్ పాండ్యాకు ముందున్న సవాళ్లు ఏంటో అతనికి బాగా తెలుసు. అంతకుముందు గుజరాత్ టైటాన్స్‌ను 2022లో విజేతగా, 2023లో రన్నరప్‌గా నిలిపి తన నాయకత్వ పటిమను నిరూపించుకున్నాడు. కానీ, ముంబైకి తిరిగి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2024 సీజన్‌లో ముంబై పట్టికలో అట్టడుగు స్థానంలో నిలవగా, 2025లో నాలుగో స్థానానికి చేరుకుని కాస్త మెరుగుపడింది. అయితే, ప్రస్తుత 2026 సీజన్ ముంబైని మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం 3 విజయాలు మాత్రమే సాధించి, ప్లేఆఫ్స్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించే స్థితికి చేరుకుంది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదిక ప్రకారం, ముంబై ఇండియన్స్ యాజమాన్యం ఇప్పటికీ హార్దిక్ పాండ్యాకే మద్దతుగా నిలుస్తోంది. జట్టు వైఫల్యానికి అతని నాయకత్వమే కారణమని వారు భావించడం లేదు. దానికి బదులుగా, ఐపీఎల్‌లో మారుతున్న ఆట తీరుకు జట్టు త్వరగా అలవాటు పడలేకపోవడమే ప్రధాన కారణమని వారు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా పవర్ ప్లేలో ఓపెనర్ల నుంచి లభించాల్సిన మెరుపు ఆరంభాలు, డెత్ ఓవర్లలో బౌలర్ల ప్రభావం తగ్గడం వంటి అంశాలే జట్టును దెబ్బతీశాయని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు, మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ రాబోయే మెగా వేలం గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "వచ్చే ఏడాది మీ కెప్టెన్ ఎవరు? అనేది ముంబై ఆలోచించుకోవాలి. ఒకవేళ హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా కొనసాగకపోతే, అతన్ని వేలంలోకి వదిలేయడమే మంచిది. ఎందుకంటే, గత మూడు ఏళ్లుగా తను, తన జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. అటువంటి వాతావరణంలో, కెప్టెన్సీ పోయిన తర్వాత అతను ఎలా ఆడతాడో చెప్పడం కష్టం" అని డౌల్ పేర్కొన్నాడు. కెప్టెన్సీ భారం తగ్గితే హార్దిక్ తన పాత ఫామ్‌ను తిరిగి సాధించగలరా? అన్న ప్రశ్నకు డౌల్ స్పందిస్తూ.. "అది అతనికి స్వేచ్ఛను ఇవ్వవచ్చు లేదా నేను విఫలమయ్యాను అనే భావనను కలిగించవచ్చు. హార్దిక్ ఫిట్‌గా ఉంటే ప్రపంచంలోనే అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడు.











# ఓటిటిలోకి తిమ్మరాజుపల్లి టీవీ

హీరో కిరణ్ అబ్బవరం నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై అందరికీ బాల్యంలోని జ్ఞాపకాలను గుర్తుచేసింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకుల ముందుకువచ్చేందుకు సిద్ధమైంది. మే 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా తెలుపుతూ ఆహా పోస్టర్ విడుదల చేసింది. కొత్త నటీనటులను పరిచయం చేస్తూ వి.మునిరాజ్ ఈ సినిమాను తెరకెక్కించారు. టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం. తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అ÷–దదెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొ÷–టటె). ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదేరోజు రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అన్నది మిగిలిన కథ.



# పెద్ది మూవీ అమెరికాలో రికార్డుల సృష్టి

సాధారణంగా ఒక సినిమా బాక్సాఫీస్ సత్తా ఏంటో తెలియాలంటే థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాలి. ట్రైలర్ ఇచ్చే కిక్కును బట్టే ఆ సినిమా మార్కెట్ పొటన్షియాలిటీ ఆధారపడి ఉంటుంది. కానీ, కొన్ని సినిమాలు మాత్రం ఈ లెక్కలకు అతీతం. కేవలం క్రేజీ కాంబినేషన్ మీద ఉన్న నమ్మకం, హీరో ఇమేజ్ ఇచ్చే ధైర్యంతోనే అంచనాలు ఆకాశాన్ని తాకుతుంటాయి. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ , సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది సినిమా సరిగ్గా ఇదే మ్యాజిక్ చేస్తోంది. పెద్ది సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి కూడా అంచనాలు ఆకాశాన్ని తాకుతూనే ఉన్నాయి. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ పెద్ది రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. ఇంకా ట్రైలర్ కూడా బయటకు రాకముందే నార్త్ అమెరికాలో రికార్డుల వేట మొదలైపోయింది. బుకింగ్స్ ప్రారంభించిన కేవలం నాలుగు గంటల్లోనే 100ఐ మార్కును దాటి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏ భారతీయ సినిమాకు సాధ్యం కాని రీతిలో, అతి తక్కువ సమయంలో ఈ మైలురాయిని చేరుకోవడం ఒక్క రామ్ చరణ్‌కే చెల్లింది.

# శంబాల డైరెక్టర్‌తో సందీప్ కిషన్ మూవీ

టాలెంటెడ్ నటుడు సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. సందీప్ కెరీర్‌లో 33వ చిత్రంగా అత్యంత భారీ స్థాయిలో రూపొందనున్న కొత్త ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇదొక సోషియో–ఫాంటసీ, మైథాలజికల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కనుంది. 'మౌనంగా జన్మించాడు.. కాలాలను జయించేందుకు సిద్ధమయ్యాడు' అనే అర్థం వచ్చేలా విడుదల చేసిన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ పోస్టర్‌లో సింహం ఒక చిన్నారిని చూస్తూ గంభీరంగా కనిపిస్తుండగా, మధ్యలో ఉన్న కత్తి సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహిధర్ రెడ్డి ఈ పాన్–ఇండియా చిత్రాన్ని అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, ఈ ఏడాది ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ–సూర్యాపేట–యాదాద్రి

# దేవరకొండలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

## 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

## రైతు పండించిన చివరి గింజ వరకు కొంటాం

## ఎమ్మెల్యే బాలు నాయక్ భరోసా

**అక్షరకలం నల్గొండ**

యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ అన్నారు. దేవరకొండ నియోజక వర్గ పరిధిలో 15 రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు పూర్తి చేయాలని చెప్పారు. శనివారం దేవరకొండ ఆర్డీవో కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్,. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిపోయిన ధాన్యం కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. దేవరకొండ డివిజన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో మిల్లర్ల సమన్వయం ద్వారా ధాన్యం వేగంగా మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన చోట హమాలీల సంఖ్యను పెంచడంతో పాటు, అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం కళ్లాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరితగతిన తరలింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని






సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ487 కోట్లు చెల్లించామని తెలిపారు. డివిజన్ పరిధిలోని 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని పేర్కొంటూ అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని,ఒక వేళ వర్షానికి ధాన్యం తడిచినా కొంటుందని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గానికి ఈసారి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. డిండి ప్రాంతంలో ఇంకా వరి కోతలు కొనసాగుతున్నాయని, అక్కడినుండి వచ్చే ధాన్యం కొనుగోలుకు అనుగుణంగా కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.నియోజకవర్గంలోని 12 మిల్లుల మిల్లర్లు ధాన్యం స్వీకరణలో భాగస్వామ్యం కావాలని కోరారు.ప్రస్తుతం ఉన్న 70 లారీలు సరిపోకపోతే మరిన్ని లారీలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఏ కేంద్రంలో ధాన్యం ఎక్కువగా ఉంటే అక్కడికి వెంటనే లారీలు పంపిస్తామని చెప్పారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందని. మిల్లర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశనికి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఇంచార్జ్ ఆర్డీఓ రమణారెడ్డి, డిఎస్ఓ వెంకటేష్, డిఎం రాంపత్తి నాయక్, డిసిఓ పత్యా నాయక్, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డిటి ముబీన్, రైస్ మిల్లర్ల తరఫున వెంకన్న, శ్రీనివాస్,అధికారులు, తదితరులు హాజరయారు.

# శిలాఫలకాలకే పరిమితమైన 'ఆరోగ్య' కల

## తాటికోల్ పీహెచ్ సి పై ప్రత్యేక కథనం

**అక్షరకలం దేవరకొండ**

అది దేవరకొండ మండలంలోని ఒక చైతన్యవంతమైన గ్రామం. పేరు తాటికోల్. ఊరి జనాభాకు తగ్గట్టుగా అన్ని వసతులు ఉన్నా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే 'వైద్యం' మాత్రం ఆ ఊరికి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఒకటా రెండా.. దాదాపు దశాబ్ద కాలంగా ఆ ఊరి ప్రజలు ఒకే ఒక కల కంటున్నారు.. అదే తమ ఊరిలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు. కానీ ఆ కల నేటికీ శిలాఫలకాల కిందే నలుగుతోంది.

**రాజకీయ మార్పులు.. మారని రాతలు...**

తాటికోల్ పీహెచ్ సి కథ చూస్తుంటే "ప్రభుత్వాలు మారుతున్నాయి.. శంకుస్థాపనలు జరుగుతున్నాయి.. కానీ పునాది రాళ్లు మాత్రం కదలడం లేదు" అన్న సామెత గుర్తుకు





వస్తుంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ ఆశల మధ్య మొదటిసారి ్రాఎజ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే వైద్యం చేరువవుతుందని ప్రజలు సంబరపడ్డారు.కాల చక్రం తిరిగింది, ప్రభుత్వం మారింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా ప్రజాప్రతినిధులు మరోసారి శంకుస్థాపన చేశారు.ఒకే భవనానికి రెండుసార్లు కొబ్బరికాయలు కొట్టారు తప్ప, ఒక్క ఇటుక కూడా పడకపోవడం గమనార్హం.

**కాంట్రాక్టర్ ఉన్నా.. కదలని పని.!**

ఈ కథలో అసలు ట్విస్ట్ ఏమిటంటే.. భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నా, పని మాత్రం ముందుకు సాగడం లేదు. క్షేత్రస్థాయి సమాచారం ప్రకారం, గ్రామస్థాయిలో ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత లేదా రాజకీయ కారణాలతో కాంట్రాక్టర్‌ను పనిచేయనివ్వకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్ సామాగ్రితో సిద్ధపడినా, స్థానిక అడ్డంకుల వల్ల వెనక్కి తగ్గాల్సి వస్తోందని గ్రామస్థులు గుసగుసలాడుకుంటున్నారు.

**ప్రజల గోస పట్టదా.?**

"మా ఊరికి ఆస్పత్రి వస్తే అర్ధరాత్రి పూట పాము కాటు వేసినా, గర్భిణీలకు నొప్పులు వచ్చినా దేవరకొండకో లేక హైదరాబాద్‌కో పరుగెత్తాల్సిన తిప్పలు తప్పుతాయి అనుకున్నాం. కానీ నాయకుల పంతాల మధ్య మా ప్రాణాలు గాలిలో దీపాల్లా మారాయి" అని ఒక వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజాప్రతినిధుల మధ్య ఉన్న విభేదాలు ఒక ఊరి ఆరోగ్య హక్కును కాలరాయడం ఎంతవరకు సమంజసం అని విద్యావంతులు ప్రశ్నిస్తున్నారు.

**/ఎమ్మెల్యే చొరవపైనే ఆశలు...**

ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రతిష్టంభన తొలగాలంటే స్థానిక ఎమ్మెల్యే నేరుగా జోక్యం చేసుకోవాల్సి ఉంది. శంకుస్థాపన చేసిన పిహెచ్సి పనులను ఎవరు అడ్డుకుంటున్నారో ఆరా తీసి, వారికి కఠిన హెచ్చరికలు జారీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శిలాఫలకాల మీద పేర్లు చెక్కుకోవడం కాదు.. భవనం గోడల మీద ఆస్పత్రి పేరు రాసినప్పుడే తాటికోల్ ప్రజల దశాబ్దాల కలకు విముక్తి లభిస్తుంది. మరి పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారో లేదో వేచి చూడాలి.

# యశోద ఆసుపత్రిలో కిడ్నీ బాధితురాలికి విజయవంతమైన చికిత్స

**అక్షరకలం దేవరకొండ:**

తీవ్రమైన కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్న దేవరకొండకు చెందిన మహిళకు మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యులు విజయవంతంగా చికిత్స అందించి పునర్జన్మ ప్రసాదించారు.




**కేసు వివరాలు ఇలా ఉన్నాయి :**

దేవరకొండకు చెందిన శ్రీమతి చిన్న చక్కని పద్మ (32) తీవ్రమైన జ్వరం, ఒళ్లు వాపులు, మూత్ర విసర్జన తగ్గిపోవడం వంటి సమస్యలతో యశోద ఆసుపత్రిలో చేరారు. ఆమెను పరీక్షించిన కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చేతన్ వీరమనేని, ఆమె 'అక్యూట్ కిడ్నీ ఇంజరీ', 'రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్' అనే క్లిష్టమైన సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వ్యాధి మూలకారణాన్ని కనుగొనేందుకు అల్ట్రాసౌండ్ గైడెన్స్‌తో రీనల్ బయాప్సీ నిర్వహించారు. ప్రత్యేక నెఫ్రాలజీ వైద్య బృందం నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందించడంతో ఆమె ఆరోగ్యం వేగంగా మెరుగుపడింది. వాపులు తగ్గి, కిడ్నీలు తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడంతో ఆమెను తాజాగా డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చేతన్ వీరమనేని మాట్లాడుతూ.. "కిడ్నీ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే 50-60 శాతం మందికి డయాలసిస్ అవసరం లేకుండానే నయం చేయవచ్చు. ముఖ్యంగా యువతలో ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు భయపడకుండా సరైన వైద్య పరీక్షలు చేయించుకోవాలి" అని సూచించారు. క్లిష్టమైన కేసును సమర్థవంతంగా పరిష్కరించిన వైద్య బృందాన్ని యశోద ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర అభినందించారు. అత్యాధునిక సాంకేతికతతో ఎలాంటి కిడ్నీ వ్యాధులనైనా నయం చేసే సదుపాయాలు తమ వద్ద ఉన్నాయని వారు తెలిపారు.

# రైతులంటే పట్టింపులేని సిఎం రేవంత్

## అకాల వర్షాలతో నష్టపోయినా చర్యలు లేవు

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**సిద్దిపేట,**

అకాల వర్షాల వల్ల రైతులు చాలా నష్టపోతున్నారని.. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి రైతులపై పట్టింపు లేదని.. మూడు పంటలకు రైతుబంధు కూడా ఇవ్వలేదని హరీశ్ విమర్శించారు. ఢిల్లీకి లేఖలు రాయడం మాని, వెంటనే పండిన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లిపూర్ సొసైటీ వద్ద పొద్దు తిరుగుడు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు బాధపడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క రివ్యూ మీటింగ్ కూడా పెట్టలేదని విమర్శించారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం కోతల సీజన్ వచ్చినప్పుడల్లా రివ్యూ మీటింగ్‌లు పెట్టి రైతుల అవసరాలన్నీ తీర్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎంతో పాటు మంత్రులు కూడా రివ్యూ చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. వడ్లు, పొద్దు తిరుగుడు, మక్కలు ఎలా కొనుగోలు చేస్తున్నారో చూడడానికి ఒక్క మంత్రి కూడా రైతుల దగ్గరికి రాలేదని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైన పని మరేముంటుందని ప్రశ్నించారు. సిద్దిపేట, చిన్నకోడూరు మండలాల్లో సన్‌ఫ్లవర్ రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం,




రాష్ట్ర ప్రభుత్వం అని తేడా లేకుండా రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయాలని చెబుతున్నారని.. పంట మార్పిడి చేస్తే కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సూర్యాపేట, సిద్దిపేట, జాలి తదితర ప్రాంతాల్లో వడ్లను బి గ్రేడ్ పేరుతో, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి.. మాటలు బంద్ చేసి ఐకేపీ సెంటర్ దగ్గరికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడాలి. 40 రోజులుగా సన్‌ఫ్లవర్ కొనుగోలు చేయకపోవడంతో పంటకు చెదలు పడుతున్నాయి' అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఘనంగా శ్రీ చౌడలమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి

**అక్షర కలం సిద్దిపేట మే 09:**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ చౌడలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈమహోత్సవంలో గ్రామ యాదవ సంఘ సభ్యులు, మహిళలు, యువకులు, నాయకులు, గ్రామ ప్రజలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని అత్యంత వైభవంగావిజయవంతం చేశారు.ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణాన్నిసంతరించుకుంది.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,గ్రామ దేవతల ఆశీస్సులతో



సుఖసంతోషాలతోఉండాలనిఆకాంక్షించారు.గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజికఐక్యతనుపెంపొందిస్తాయని తెలిపారు.జై చౌడలమ్మా నినాదాలతో విఠలాపూర్ గ్రామం మారుమోగగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# మొక్కజొన్న దగ్ధంతో రైతుకు భారీ నష్టం

## కౌలు రైతును ఆదుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్

పెద్దపల్లి,

ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైన కౌలు రైతు గోపు శ్రీనివాస్‌ను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మాజీ జెడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ డిమాండ్ చేశారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన మొక్కజొన్న చేను వారు శనివారం పరిశీలించారు. బాధిత రైతు శ్రీనివాస్ ఎకరంన్నర భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగు చేయగా, పంట చేతికొచ్చే సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పంట పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల మేర పంట నష్టం జరిగినట్లు తెలిపారు. రైతుబంధు సాయం అందక, కౌలు భారంతో ఉన్న రైతుకు ఈ నష్టం కోలుకోలేని దెబ్బ అని, కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే స్పందించి పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగా శ్రీనివాస్ రెడ్డి, సుముఖం రవీందర్ రెడ్డి, నక్కల రాయమల్లు, అల్లం సదయ్య, జంగా సుఖేందర్ రెడ్డి, శ్రీనివాస్, పెంట రవి,జంగ రాజిరెడ్డి మూల సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు

## ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కోరుట్ల కమిషనర్

జగిత్యాల,

నిషేదిత సింగిల్ యూజ్ ఎ÷–లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. పట్టణంలోని పలు కిరాణాషాపులు, ప్లాస్టిక్ దుకాణాలు, కూరగాయల షాపులు, టిఫిన్ సెంటర్లలో శనివారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వ్యాపారులు వినియోగిస్తున్న సింగిల్ యూజ్ ఎ÷–లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు రూ. 10,200 జరిమానా విధించారు. ఈమేరకు వ్యాపారులకు బట్ట సంచులు, పేపర్ సందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిస్థాయిలో నిషేదించేందుకు కఠిన నిబంధనలు అమలు చేస్తామన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఎ÷–లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలన్నారు. ఎ÷–లాస్టిక్ కవర్లు విక్రయించిన, కొనుగోలు చేసిన దుకాణదారులకు భారీ జరిమానాలు విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. వ్యాపార కార్యకలాపాలతో వెలువడిన చెత్తను తడి, పొడి, హానికరక చెత్తగా వేరు చేసి షాప్ వద్దకు వచ్చే మున్సిపల్ వాహన సిబ్బందికి అందించాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రాజేందప్రసాద్, ఇంచార్జీ శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్, రికార్డు అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రేకొండలో ఉచిత కంటి వైద్యశిబిరం

కరీంనగర్,

:చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గంగిశెట్టి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో శ్రీనివాస విజన్ సెంటర్, మెడికవర్ హాస్పిటల్ కి చెందిన వైద్య సిబ్బంది 258 మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 29 మందికి కంట్లో పొరలు ఉన్నట్టు గుర్తించి వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించడం జరుగుతుందని కంటి వైద్య నిపుణులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులందరికీ ఉచితంగా భోజన వసతి కల్పించారు. వైద్య శిబిరంలో ట్రస్ట్ ఫౌండర్ గంగిశెట్టి జగదీశ్వర్, సర్పంచ్ అల్లేపు సంపత్, కారోబార్ పీరల్ల రాజకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపగోని తిరుపతి, సతీష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# మనీలాండరింగ్ కేసులో ఇడి దూకుడు

## పంజాబ్ పరిశ్రమల శాఖ మంత్రి సంజీవ్ అరోరా అరెస్ట్

చండీఘఢ

మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పంజాబ్ పరిశ్రమల శాఖా మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం అరెస్టు చేసింది. మోసపూరిత జీఎస్టీ లావాదేవీలతో రూ.100 కోట్ల నగదు అక్రమ రవాణా జరిగినట్టు ఆరోపణలు రావడంతో దర్యాప్తు ప్రారంభించిన ఈడీ తాజాగా మంత్రిని పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్టు చేసింది. ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్‌లోని మంత్రి సంజీవ్ అధికారిక నివాసం సహా మొత్తం ఐదు చోట్ల ఈడీ అంతకుముందు సోదాలు నిర్వహించింది. మంత్రికి సంబంధించిన వ్యక్తులు, కంపెనీల భవనాల్లో కూడా రెయిడ్స్ నిర్వహించిన అనంతరం మంత్రి సంజీవ్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మంత్రికి సంబంధించిన వారు ఫేక్ కంపెనీల సాయంతో మొబైల్ ఫోన్ కొనుగోళ్ల పేరిట నకిలీ బిల్లులను సృష్టించారు. ఈ బిల్లుల సాయంతో అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, జీఎస్టీ రీఫండ్స్, ఇతర ఎగుమతి ఆధారిత ప్రయోజనాలను ÷–లకెయిమ్ చేసుకున్నారు. ఇలా అక్రమంగా వచ్చిన డబ్బును అక్రమంగా దుబాయ్‌కు పంపించి తిరిగి భారత్‌కు తీసుకొచ్చి మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రి అరెస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఆప్ నేతలు మాత్రం మంత్రి సంజీవ్ అరెస్టును ఖండిస్తున్నారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల సాయంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు.

# ఘనంగా "విద్యా" వారోత్సవాలు

## రేపటి నుండి 17 వరకు నిర్వహణ

## కలెక్టర్ చంద్రశేఖర్

## విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం

## సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెల్లడి

## వానల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం





ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు "విద్యా వారోత్సవం" నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. విద్యా వారోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుండి విద్య వారోత్సవం, స్వీయ గణన, ఫార్మర్స్ రిజిస్ట్రీ, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ పై అంశాలపై జిల్లా అధికారులకు సూచనలు చేశారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 11 నుండి 17 వరకు విద్యా వారోత్సవం విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యా వారోత్సవం లో భాగంగా విద్యాసంస్థల్లో పనుల శంకుస్థాపన, ఎస్ ఎస్ సి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లమెంటరీ పరీక్షలు ద్వారా ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, వర్క్ షాప్ ల ఏర్పాటు, జయశంకర్ బడిబాట కార్యక్రమం, పోషకుల సమావేశాలు, విద్యా వేడుకల కార్యక్రమాలు నిర్ణిత ప్రణాళిక ప్రకారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలింపు చేపట్టాలని వివరించారు. తగినన్ని గన్ని సంచులు, లారీలు, తగినంతమంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ నాయక్, డీఈఓ బిక్షపతి, డిఐఈఓ దస్రు నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, ఉన్నారు.

# ప్రజల అవగాహన కోసం ప్రచార రథం

## జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

## జనగణన సందర్భంగా పూర్తి సమాచారం ఇచ్చి సహకరించండి

## జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



జనగణనకు ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇచ్చి సహకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. జనగణన అన్ని రకాల అభివృద్ధికి ముఖ్యమని, జనగణలో ప్రతి కుటుంబం వారి వివరాలను తెలియజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని శనివారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. 2027 జన గణనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మొదటి విడత సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేపట్టడం జరిగిందని, అది ఈ నెల 10 తో ముగుస్తుందని, ఈ నెల 11 నుండి హౌస్ లిస్టింగ్, జనగణన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, జనగణనకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు చేపట్టిందని, ఈ నెల 11 నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వచ్చి జనాభా వివరాలు సేకరిస్తారని, ఇందుకు జిల్లాలోని ప్రజలందరూ సరైన, పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. జనాభా వివరాల సేకరణ కేవలం జనాభా లెక్కలకు ఉద్దేశించి మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. జనగణనలో ఇండ్లకు సంబంధించిన వివరాలతో పాటు, కుటుంబాల వివరాలు సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. జనగణన పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ప్రచార రథం జిల్లాలోని 33 మండలాల పరిధిలో పర్యటించి జనగణన పై ప్రజలకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ జనగణనకు సహకరించాలని పునరుద్ఘాటించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, సి పి ఓ శ్రీనివాస్ నాయక్, జిల్లా అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బిజెపి నాయకత్వ పటిమ అమోఘం

## బెంగాల్ సిఎం సువేందుకు పవన్ శుభాకాంక్షలు

అమరావతి

పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ చరిత్రాత్మక విజయాన్ని సాధించడానికి సంవత్సరాల తరబడి పోరాటం చేశారన్నారు. దీనికి దృఢంగా నిలిచిన బీజేపీ బెంగాల్ నాయకత్వానికి, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. 'ప్రజాకేంద్రిత పాలనను అందించడంలో నూతన బీజేపీ ప్రభుత్వం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. దీనిని కేవలం బీజేపీ లేదా పశ్చిమ బెంగాల్ విజయంగానే కాకుండా, భారత ప్రజల గెలుపుగా భావిస్తున్నాను. సంవత్సరాలుగా హింస, అరాచకం, అక్రమ వలసలు, తీవ్రవాద చొరబాట్లపై పెరుగుతున్న ఆందోళనలకు పశ్చిమ బెంగాల్ సాక్ష్యంగా నిలిచింది. ఇవి సామాజిక సామరస్యం, జాతీయ భద్రతకు తీవ్రమైన సవాళ్లను విసిరాయి. ఇలాంటి కీలక సమయంలో జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, బలమైన పాలనతో ఈ సవాళ్లను పరిష్కరించడానికి ఇచ్చిన ఈ ప్రజా తీర్పు గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమానికి సైద్ధాంతిక పునాది వేసిన దార్శనికుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నా నివాళులు. శ్యామా ప్రసాద్ జన్మస్థలమైన పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం.. ఆయన దార్శనికత, సిద్ధాంతానికి తగిన నివాళిగా నిలుస్తోంది. ఈ ప్రజా తీర్పు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ అద్భుతమైన విజయానికి దోహదపడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య, ప్రతి బీజేపీ కార్యకర్తకు నా హృదయపూర్వక అభినందనలు' అంటూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

## నేడు ప్రధాని బహిరంగ సభ

### డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులపై నిషేధం

### 2వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు

### మల్కాజిగిరి డిసిపి సుమతి వెల్లడి

హైదరాబాద్

:హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు నగర యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ సభకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై మల్కాజిగిరి డిసిపి సుమతి కీలక వివరాలను వెల్లడించారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 2,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా సభా ప్రాంగణంలోకి డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులను తీసుకురావడంపై నిషేధం విధించారు. బహిరంగ సభ దృష్ట్యా.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై ఎక్కడైనా వాహనాలను పార్క్ చేస్తే.. వాటిని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సభకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామని, వాహనదారులు పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా అక్కడ క్యూఆర్ (ఖీఖీ) కోడ్‌లను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు.

## బోధన పట్టణ శివారలు ఈతవనాలు దగ్ధం

### దుండగులపై చర్యలకు గీతకార్మికుల వినతి



బోధన్,

బోధన్ పట్టణంలోని పసుపువాగు శివారులోని సర్వే నంబర్ 594 లోని సుమారు 50 నుంచి 60 ఈత చెట్లను శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి, కాల్చి ధ్వంసం చేశారు. గీత కార్మిక సంఘానికి చెందిన తమ భూమిలో ఈత చెట్లను ధ్వంసం చేసి కాల్చి వేసినట్లు సమాచారమందుకున్న బోధన్ గీత కార్మిక సంఘం నాయకులు, గీత కార్మికులు ఈత వనాన్ని పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వనంలో ఈత చెట్ల ద్వారా జీవనోపాధి పొందుతున్న సమయంలో ఈ సంఘటన జరగడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని కోరుతూ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు గీత కార్మిక సంఘం నాయకులు, గీత కార్మికులు తెలిపారు. బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు కు ఫిర్యాదు చేసిన వారిలో పీ గంగాధర్ గౌడ్, బీ లింగాగౌడ్, కందుకాల శ్రీకాంత్ గౌడ్, వై జీవన్ గౌడ్, వై రమేష్ గౌడ్, ఏం రాజేందర్ గౌడ్ తో పాటు కల్లు గీత అసాబబిజీ సంఘం నాయకులు, కల్లుగీత కార్మికులు ఉన్నారు.

## వేముల సమక్షంలో బిఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు

నిజామాబాద్

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని ఎర్గట్ల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సున్నపు అంజయ్య, జిట్టావోయినా రాజు, నాయుడు పోశెట్టికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా వాటిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకపోవడం, రైతుబంధు, బోనస్ వంటి హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం, పంట కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, అందుకే తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజా పూర్ణనందం, ఎర్గట్ల సర్పంచ్ ఉపేందర్, మాజీ జడ్పీటీసీ గుళ్ళే రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ మధు, పార్టీ అధ్యక్షులు దేవుని నర్సయ్య, సొసైటీ చైర్మన్ బర్మా నర్సయ్య, ప్రభాకర్,కుశ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. మూడు నెలల్లోపే దరఖాస్తుల కొలిక్కి

- క్లస్టర్ల వారీగా సమస్యల సేకరణ.. అక్కడికక్కడే పరిష్కారానికి ప్రాధాన్యత
- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- తిరుమలాయపాలెం క్లస్టర్ ప్రజా దర్బార్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి







అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

తిరుమలాయపాలెం : ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితిలోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు. తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



### మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్లు

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

### ధరణి చిక్కుముడులకు 'భూ భారతి'

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే.. మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.





### ధాన్యం కొనుగోళ్లపై భరోసా

రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తిస్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ప్రజానాట్యమండలి శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయండి



**అక్షర కలం/ కారేపల్లి:**

సింగరేణి మండలం పాటిమీద గుంపు గ్రామంలో మే 17 నుంచి 19 వరకు జరగనున్న ప్రజానాట్యమండలి పాటల శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయాలని సిపిఎం వైరా కార్యదర్శి భూక్యా వీరభద్రం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు నామ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సింగరేణి మండల కమిటీ సమావేశం శనివారం ఎర్రబోడులో ఎండి ఇస్మాయిల్ అధ్యక్షతన జరగా వారు మాట్లాడుతూ ప్రజా కలలను ప్రోత్సహించడం ప్రత్యామ్నాయ సంస్కృతి అభివృద్ధి చేయడానికి ప్రజానాట్యమండలి నిర్వహించే శిక్షణ శిబిరం ఉపయోగపడుతుందని ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా కలల అభివృద్ధి కోసం శ్రమైక జీవన సౌందర్యాన్ని శ్రమజీవుల కష్టాలను ఆవిష్కరించే మతోన్మాద పెట్టుబడిదారి శక్తులు మీడియాను సినిమాను చరిత్రను వక్రీకరించి అసలు చరిత్రను మరుగున పరిచే విధంగా వ్యవహరిస్తున్నాయని దీనికి ప్రత్యామ్నాయమైన ప్రజా కళలను ప్రోత్సహించడం ద్వారానే నిజమైన ప్రజా కళలు ప్రజలకు ఉపయోగపడతాయని అందుకోసం పాటిమీద గుంపులో జరిగే శిక్షణ శిబిరానికి హార్దికంగా ఆర్థికంగా సహకరించి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్జ రామారావు, మండల కమిటీ సభ్యులు దాసరి మల్లయ్య,వల్లబోయిన కొండల్ రావు,కేశ గాని ఉపేందర్, శాఖ కార్యదర్శి కరపటి సీతారాములు తేజ వత్ చందర్, బానోతు కిషన్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ధారావత్ వినోద్ కుమార్, ఎజ్జు యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఐజ పట్టణంలో అగ్ని ప్రమాదం -- ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని టి ఆర్ పి జిల్లా అధ్యక్షుడు మొరుగు వీరేష్ డిమాండ్





**అక్షర కలం జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నియోజకవర్గం ఐజ పట్టణ కేంద్రంలోని 10వ వార్డు దుర్గా నగర్ కాలనీలో దుర్గమ్మ గుడి సమీపంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 10కు పైగా గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనతో అన్నదాతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించడంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. ఈ సందర్భంగా టి ఆర్ పి జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు మొరుగు వీరేష్ మాట్లాడుతూ, గత ఎన్నో దశాబ్దాలుగా ఐజలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు ఎన్నో వినతిపత్రాలు సమర్పించినా, ధర్నాలు నిర్వహించినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రెవెన్యూ డివిజన్‌గా మారేందుకు అన్ని అర్హతలు కలిగిన ఐజ మున్సిపాలిటీలో ఇప్పటికీ ఫైర్ స్టేషన్ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి నాయకులు కేవలం తమ స్వార్థ ప్రయోజనాలకే పరిమితమవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని విమర్శించారు. ఈ విషయంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు రెండూ సమాన బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు.ప్రతి వేసవి కాలంలో ఐజ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరుగుతున్నప్పటికీ, సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని గద్వాల నుంచి ఫైర్ ఇంజన్ ఆలస్యంగా చేరుకోవడం వల్ల స్థానిక ప్రజలే ప్రాణాలకు తెగించి మంటలను ఆర్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రజలు మంటలను అదుపులోకి తెచ్చిన తర్వాత మాత్రమే ఫైర్ సిబ్బంది చేరుకొని నీళ్లు చల్లడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్ని ప్రమాదాలు జరిగినా, ఎంత ఆస్తి నష్టం సంభవించినా అధికార యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడటం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత కాదా అని ప్రశ్నించారు. ప్రజల పన్నుల డబ్బుతో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ఐజ పట్టణంలో శాశ్వత ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని టి ఆర్ పి జిల్లా అధ్యక్షులు మొరుగు వీరేష్ డిమాండ్ చేశారు.

## గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి

మెట్‌పల్లి మే 9 (అక్షర కలం) జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలలో భాగంగా శనివారం మెట్‌పల్లి డీఎస్పీ రాములు మేడి పల్లి పోలీస్ స్టేషన్ పరిదిలోని పొరుమల్ల గ్రామశీ లో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను ప్రారంభించారు ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ.. గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నేరాల నివారణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీసీ కెమెరాలు పోలీసులకు ఒక



శక్తివంతమైన ఆయుధంలా మారాయని పేర్కొన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు దానిలో పాల్గొన్న నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల ఫుటేజ్ కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామంలో జరిగే చిన్న చిన్న సంఘటనల నుండి పెద్ద ఘటనల వరకు ప్రతి అంశాన్ని సీసీ కెమెరాల ద్వారా తక్షణమే గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేస్తూ ప్రజలకు నిరంతర భద్రతను అందిస్తాయని, నేరాలను తగ్గించడంలో మరియు అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు.

# భద్రాచలంలో గిరిజన విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం

**అక్షర కలం / భద్రాచలం**



ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారిబి.రాహుల్, ఆదేశాలమేరకుతొంభైతొమ్మిదిరోజుల ప్రజాపాలనప్రగతిప్రణాళికలోభాగంగా గిరిజన సంక్షేమ శాఖఆధ్వర్యంలో నిర్వహించినగిరిజనఆశ్రమపాఠశాలలుమరియువసతిగృహాలవి ద్యార్థుల పదిహేను రోజుల వేసవి శిక్షణశిబిరం ఘనంగా నిర్వహించి ముగించడం జరిగిందని పి ఎమ్ ఆర్ సిఏసీఎంవో. రమేష్,అన్నారు. శనివారంనాడుభద్రాచలం పట్టణంలోనిగిరిజనసంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో వేసవిశిక్షణశిబిరంముగింపుసమావేశంలోజిసిడివో. అలివేలుమంగతాయారు,తోకలిసిఆయనపాల్గొన్నారు. పదిహేనురోజులవేసవి శిక్షణశిబిరంలో విద్యార్థులునేర్చుకున్ననృత్యాలు, పాటలు, యోగ,ఆర్ట్ మరియు క్రాఫ్ట్ ప్రదర్శనలు తిలకించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులో నిర్వహించేది విద్యార్థినీ విద్యార్థులలోదాగివున్ననైపుణ్యాలను వెలికితీయడానికి మరియు వారికి ఇష్టమైనక్రీడలుఇతరకళలపట్ల మక్కువ కలిగించి ఉత్తములుగా తీర్చిదిద్దడానికి ఈ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని,పదిహేనురోజులుగామీరునేర్చుకున్నప్రతి అంశాలనుప్రతిరోజుసాధనచేసిమీరుఅనుకున్నదిసాధించేవరకు విశ్రమించకూడదనిఅన్నారు. అనంతరంజిసిడివోఅలివేలుమంగ తాయారు,మాట్లాడుతూ పదిహేనురోజులవేసవిశిక్షణశిబిరంలో విద్యార్థులు వారికి ఇష్టమైన కళలు మరియు ఇతర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి నేర్చుకొని పరినీతి చెందారనిఈసందర్భంగావారిప్రతిభను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆమె తెలుపుతూ వేసవి సెలవులలో తీసుకోవలసినజాగ్రత్తలగురించివిద్యార్థిని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలు వారి మనసులోని భావాలను విద్యార్థుల ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఇటువంటి క్యాంపులునిర్వహించడం వలన విద్యార్థిని విద్యార్థులు వారికి ఇష్టమైన కళలు క్రీడల పట్ల మక్కువ పెంచుకొని చదువుతోపాటు కళా రంగంలో కూడా స్థిరపడడానికి దోహద పడతాయని,పిల్లలలో దాగివున్న ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి ఐటీడీఏ పీవో ప్రత్యేక బాధ్యత తీసుకొని గిరిజన విద్యార్థినీవిద్యార్థులపట్లచూపుతున్న కృషికి మా తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పిల్లల తల్లిదండ్రులుతెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం క్యాంపు ఇంచార్జ్ సీహెచ్ సుభద్ర,అసిస్టెంట్ క్యాంపు ఇంచార్జ్ పి.జే నాగరాజు, హెచ్‌డబ్ల్యూఓ వసంత్,పీడీ మహాలక్ష్మి,పీఈటీలు,రిసోర్స్ పర్సన్స్ నటరాజ్,అజ్మీరా విజయలక్ష్మి,నాగలక్ష్మి,సుజాత మరియు విద్యార్థిని,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి.

**ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి.**

**విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**అక్షర కలం జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో



వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు.గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ 66 శాతం పూర్తయిందని, పంచాయతీ కార్యదర్శుల సహకారం కూడా తీసుకొని, ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఐఈఓ హృదయ రాజ్, డీఈవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను పరిరక్షించుకోవాలి... - జిల్లా అదనపు కలెక్టర్ నగేష్....

**మెదక్ /కొల్చారం మే09(అక్షర కలం):-**





చెరువులను పరిరక్షించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ అన్నారు.శనివారం మెదక్ మండలంలోని కోముటూరు చెరువు కట్టపై ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు



చేసుకోవడం జరిగిందని, కార్యక్రమం ద్వారా చెరువుల పరిరక్షణ, పూడిక తీత, ముల్లా చెట్ల పొదల తొలగింపు, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. చెరువు బాగుంటేనే ఊరు బాగుంటుందని, చెరువు ద్వారా పంటలు పండి గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరువులను కాపాడుకొని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు అన్నారు. చెరువులను అక్రమాల నుండి, కాలుష్యం నుండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాహాసిల్దార్ లక్ష్మణ్ బాబు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు అంబేద్కర్ చౌరస్తాలో నాలుగవ ప్లీనరీ పోస్టర్ విడుదల.

**ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి.**

**అక్షర కలం/పినపాక.**

మణుగూరు అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ జన సమితి పార్టీ నాలుగవ ప్లీనరీ పోస్టర్ ని శనివారం ఆవిష్కరించడం జరిగిందని జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి పోరాటాల ఫలితంగా అమరుల బలిదానాల సాక్షిగా ఏర్పడిన తెలంగాణలో అధికారంలో వచ్చిన గత ప్రభుత్వాలు ఉద్యమ ఆకాంక్షల సాధన దిశగా అడుగులు వేయకపోగా రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చి రాజ్యాంగ వ్యవస్థను బలహీనపరిచి రాష్ట్రాన్ని ఒక కుటుంబ జాగిరిగా మార్చి అప్రజాస్వామిక పాలన కొనసా గించిందని అన్నారు.అలాగే ఎన్నో త్యాగాలను సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నాటి కెసిఆర్ నాయకత్వంలో ఉద్యమ ఆకాంక్షలు సాధించకపోగా సీమాంధ్ర పాలన విధానాన్ని కొనసాగిస్తూ కాంట్రాక్టులు కమిషన్లు నోట్లు ఓట్లు సీట్లు కేంద్రంగా పాలన సాగిందని అన్నారు. రాష్ట్ర రాజకీయాలను డబ్బు అధికారం చుట్టూ తిరిగేలా మార్చారని ప్రభుత్వాన్ని వ్యక్తిగత ఆస్తిలా భావించి నిరంకుశంగా పాలన కొనసాగించారని, ప్రశ్నించే స్వరాలను అణిచివేసి అహంకారపూరితంగా వ్యవహరించారని రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీశారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మారాల్సింది కేవలం పాలకులు మాత్రమే కాదని రాజకీయ విధానాలు మరియు పాలన పద్ధతులేనని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకతతో కూడిన ప్రజాస్వామ్య రాజకీయాలు అవసరమని భావిస్తూ ఎన్నికలను ఆర్థిక బల ప్రదర్శనగా కాకుండా రాజ్యాంగ విలువలను నిలబెట్టి ప్రక్రియగా మార్చాలని లక్ష్యంతో తెలంగాణ ఉద్యమ రథసారథి ఆచార్య కోదండరాం నాయకత్వంలో తెలంగాణ జన సమితి పార్టీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ప్రజలందరికీ పైసల్లో వాటా కల్పించగల ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థ కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ సామాజిక న్యాయం జయశంకర్ సార్ ఆశయ సాధన కోసం తెలంగాణ జన సమితి పార్టీ పోరాడుతుందని తెలిపారు.నిరుద్యోగం బీసీ రిజర్వే షన్ల పెంపు అందరికీ విద్యా వైద్యం ఆదివాసి భూ సమస్యలు గోదావరి జల్లాలో న్యాయమైన వాటా విభజన హామీలు అమలు రైతులు మరీ చేతివృత్తుల వారి భద్రత స్థానికులకు ప్రైవేట్ రంగంలో అవకాశం సింగరేణి పరిరక్షణ ఫీజు రీఎంబెర్స్మెంట్ వంటి అనేక సమస్యలపై తెలంగాణ జన సమితి పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలియజేశారు. ఈనెల 12న హైదరాబాదులో జలవిహార్ లో తెలంగాణ జన సమితి నాలుగోవ ప్లీనరీకి ప్రజలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు విద్యార్థులు ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సురకంటి ప్రభాకర్ రెడ్డి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బుడ్డి వీర రాఘవులు ప్రైవేట్ టీచర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శనగ పుల్లయ్య మధు నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# నిర్మాణానికి ఆటంకంగా ఉన్న కట్టడాలను తొలగించాలి.

ఆటంకాలను తొలగించి సైడ్ డ్రైన్ నిర్మాణం పూర్తి చేస్తాం ఈ.వో హామీ.



అక్షర కలం / భద్రాచలం

భద్రాచలంగ్రామపంచాయతీఅభివృద్ధి నిధులలో భాగంగా ఇరవై వ వార్డు పరిధిలో ఎమ్మెల్యే కాలనీలో ఐదు లక్షల రూపాయలతో చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులకు ఆటంకంగా మారిన కట్టడాలను వెంటనే తొలగించి డ్రైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సిపిఎం ఇరవై వ వార్డ్ మెంబర్ ఇరప అనసూయ ఆధ్వర్యంలో వార్డు ప్రజలందరూ గ్రామపంచాయతీ ఈవో ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధిపనులకువచ్చేఆటంకాలను తొలగించి సైడ్ డ్రైన్ నిర్మాణశీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పట్టణ కార్యదర్శిగడ్డం.స్వామి,మాట్లాడుత హావార్డుఅభివృద్ధికిప్రజలుపూర్తిస్థాయిలోసహ కరించాలనిఅన్నారు.సిపిఎం గెలిచిన వార్డుల నందుఅభివృద్ధి పనులు పారదర్శకంగా జరిగేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ మెంబర్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులుబండారు. శరత్ బాబు,పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు డి.సీతాలక్ష్మి,సీనియర్ నాయకులు,పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, ఒ క శ్రీ,హైమావతి,బేగం,లక్ష్మీనా రాయణ,పద్మ,సముద్రల.రమ ణ,భషీర్,మల్లూరు,శ్రీదేవి,తదితరులు పాల్గొన్నారు.

# సుదిమల్ల జీపి లో 1కోటి ? గ్రావెల్ రోడ్డు పనులను ప్రారంభించిన శాసనసభ్యులు కోరం కనకయ్య.



అక్షర కలం / ఇల్లెందు.

ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామ పంచాయితి పరిధిలో గ్రామ శివారు నుండి పంట పొలాలకు వెళ్ళే మార్గాల నిర్మాణం కొరకై 1కోటి రూపాయల వ్యయంతో నూతనంగా 5 గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సుదిమల్ల బొడ్డురాయి నుండి చల్ల వాగు వరకు సుమారు కిలోన్నర మీటర్ వరకు రహదారికి అటు, ఇటు ట్రంచ్ కొట్టి మట్టి రోడ్డు పనులు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండలం లోని పెద్ద గ్రామ పంచాయతీ అయినా సుదిమల్ల గ్రామపంచాయతీకి బి ఆర్ఎస్ పార్టీ నుండి సర్పంచ్ గా ఎన్నికైన గుంజ సుగునయ్యకు పూల దండ వేసి శాలువా కప్పి సత్కరించి అభినందించిన శాసనసభ్యులు కోరం కనకయ్య తాను అజాతశత్రువు అని నిరూపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య వెంట ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, సుదిమల్ల ఉప సర్పంచ్ ఊకే లక్ష్మీ నారయణ,ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్, ఇల్లందు పిఎసిఎస్ సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ, మాజీ ఎంపిపి మోకాళ్ళ వెంకటమ్మ, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలుడ ఇందిరా నగర్ సర్పంచ్ పాయం లలిత, బాలాజీ నగర్ సర్పంచ్డ సర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు పాయం స్వాతి, సుభాష్ నగర్ సర్పంచ్ వాళ్ళ మంగమ్మ, సొసైటి డైరెక్టర్ కునుసోత్ రాము,కాంగ్రెస్ మండల పార్టీ సీనియర్ నాయకులు జానిపాషా,సంగె భిక్షపతి,ఐలయ్య, దండుగుల శివ, ఊకే క్రిష్ణ, చీమల బాబు, గ్రామ పెద్దలు, పి ఆర్ ఏ ఈ రాజు, గ్రామ సెక్రెటరి తదితరులు పాల్గోన్నారు.

# కొనుగోలు చేసిన మొక్కజొన్నలను గిడ్డంగిలో నిలువ చేసే ప్రక్రియను ప్రారంభించిన ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు.

అక్షర కలం / ఇల్లెందు.

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మొక్కజొన్నల నిలువ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు ఆదేశించిన సందర్భంగా ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు ఆధ్వర్యంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్లో గౌడౌన్ లో నిలువ ప్రక్రియ ను ప్రారంభించారు. ఇల్లందు మార్కెట్ పరిధిలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరుకాలం పండించిన మొక్కజొన్న పంట అకాల వర్షాలతో నష్టపోకూడద నే ఉద్ధేశంతో



గత కోద్ది రోజుల క్రితం ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య నిలువ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు ఆదేశించిన తరుణంలో నేడు ఎమ్మెల్యే అధికారుల సూచన మేరకు ఏఎంసి కార్యలయం మైసమ్మ దేవాలయంలో పూజాలు చేసిన అనంతరం గిడ్డంగిలో మొక్కజొన్న నిలువ ప్రక్రియను ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్, సొసైటి సీఈవో హిరాలాల్, సొసైటి డైరెక్టర్ కునుసోత్ రాము, దండుగుల శీవ,మార్కెట్ సిబ్బంది పిక్లా, రమేష్,స్థానిక రైతులు తదితరులు పాల్గోన్నారు.

# మాజీ మంత్రి వనమాతో నామ భేటీ

## పాల్వంచ పట్టణంలో మాజీ ఎంపీ నామ పర్యటన

అక్షర కలం/ ఉమ్మడి జిల్లా బ్యూరో:

పాల్వంచ, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం పాల్వంచ పట్టణంలో పర్యటించారు. ముందుగా మాజీ మంత్రి వనమా



వెంకటేశ్వరరావు స్వగృహానికి వెళ్లి వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు. అంతకు ముందు వనమా ఇంటి వద్ద మాజీ ఎంపీ నామ కు పాల్వంచ రూరల్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు మాజీ ఎంపీ నామ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ నామ





మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ సూచనలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు చేరువగా ఉండి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు ఆ తర్వాత పాల్వంచ పట్టణ వాస్తవ్యులు దొప్పలపూడి సురేష్ బాబు-సత్యవాణి దంపతుల కుమార్తె వివాహ వేడుక శనివారం రాత్రి జరగనున్న నేపథ్యంలో ముందుగానే మధ్యాహ్నం వారి స్వగృహానికి వెళ్లి నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుండి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పాల్వంచ పట్టణ వాస్తవ్యులు రమణమూర్తి నాయుడు నివాసానికి వెళ్లి ఇటీవల ఆయనకు సర్జరీ జరగగా వివరాలు అడిగి తెలుసుకొని వారిని పరామర్శించారు. వైద్యుల సూచనలు పాటించాలని సూచించి తిరిగి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. నాయుడు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు వనమా రాఘవ, మోరంపూడి ప్రసాద్ రావు, పాల్వంచ మండల మాజీ అధ్యక్షులు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్ మూర్తి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు గోవాడ గుణచరిత్, సింధు తపస్వి, గుగులోత్ రాంబాబు, కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్, మాజీ ఎంపీపీ సరస్వతి, ఉర్దుగా మాజీ చైర్మన్ అన్వర్ భాష, చిన్నంశెట్టి రంగయ్య, రెడ్డి నాయక్, నాయకులు ముత్యాల ప్రవీణ్, దాసరి నాగేశ్వరరావు, వాకదాని కోటేశ్వరరావు, భూక్య వీరన్న, శంకర్, జూపెల్లి దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, ప్రభాకర్ రెడ్డి, పత్తిపాటి శ్రీను, దాసరి సురేష్, బిఎల్ నాయుడు, వంశీ, బొదుగుల శ్రీధర్, కంచర్ల రామారావు, అఖిల్, సేమియా, కాలం రాజమ్మ, ఏనుగుల శీను, ఆర్ఎంపి శీను, హైమద్, బత్తుల శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత - అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

ఈనెల 10 వరకు ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోండి

సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది

అభివృద్ధికి మూలమైన జనగణ లో పాల్గొనండి.

జనగణన పై అవగాహన వాక్ ర్యాలీ ని ప్రారంభించి పాల్గొన్న అదనపు కలెక్టర్








అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది అని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.జనగణనపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నుండి జడ్పీ సెంటర్ వరకు నిర్వహించిన జనగణన అవగాహన వాక్ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి, క్రీడాకారులు, ప్రజలు, వాకర్స్ తో కలిసి ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన విధానం మే 10 వరకు జరుగుతుందని, ఈ స్వీయ గణనలో స్వచ్ఛందంగా నమోదు చేసుకోసుకొని, ఈ స్వీయ నమోదు శాతాన్ని మరింతగా పెంచాలని, అందరూ ఈ స్వీయ గణనలో నమోదు చేసుకోవాలని కోరారు. మే 11వ తేదీ నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందులో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఈ వివరాలు అంతా కూడా గోప్యంగా ఉంటుందని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, ప్రజలు ఎటువంటి భయం పడాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అదే విధంగా జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన వాక్‌లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు.జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు.దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, "మన సమాచారం -- మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, డీఎస్డీవో సునీల్ రెడ్డి, ఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, నగర ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మూడు వార్డుల్లో పర్యటించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియెల్.

అక్షర కలం / ఇల్లందు.

ఇల్లందు పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్ ఎండి కుష్బూ ఆధ్వర్యంలో, 6వ వార్డు కౌన్సిలర్ రాధా కమల్ కోరి ఆధ్వర్యంలో 10వ వార్డు కౌన్సిలర్ మెరుగు కార్తిక యాదవ్ ఆధ్వర్యంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్ల సంపూర్ణ అసంపూర్ణ నిర్మాణ తీరుతెన్నులను పరిశీలించేందుకు శనివారం మూడో రోజు ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ ప్రత్యేక పర్యటన చేసారు. పరిశీలన కార్యక్రమం కొనసాగింపు భాగంలో మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న, అసంపూర్తిగా నిలిచిపోయిన, వివిధ కారణాలతో పనులు ప్రారంభం కానీ పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ గృహాలపై ప్రత్యేక పరిశీలన కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఇప్పటికే స్థానిక 1వ, 2వ,3వ వార్డుల్లో పరిశీలనలు నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ శనివారం 4వ, 6వ 10వ వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగ్గురు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మూడు వార్డుల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి గృహ నిర్మాణ పనుల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. 4వ వార్డు కౌన్సిలర్ ఎండి కుష్బూ , 6వ వార్డు కౌన్సిలర్ రాధా కమల్ కోరి, 10వ వార్డు కౌన్సిలర్ మెరుగు కార్తిక యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనల్లో నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఇళ్లు, ఇంకా ప్రారంభం కాని గృహాలు, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ స్థాయిలో తగిన పరిష్కార చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇదే విధంగా దశల వారీగా ఇండ్ల పరిశీలన కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్ , మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, ఎండి ఆజాం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి మున్నాభాయ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎం.డి అత్తర్, కాంగ్రెస్ నాయకులు ఎండి ఖలీమ్, ఎల్ రాజేష్, పదముత్తం సంతోష్ (చంటి) కమల్ కుమార్ కోరి, ఎనగంటి చిన్న శీను, సిహెచ్ శంకర్, కొప్పుల సమ్మయ్య, సందీప్, శివ, సాయి గోపి కోరి, సంపత్ చారి, మాచర్ల వేణు, అప్పనపల్లి సతీష్, వలకాల శ్రీను, వడ్లకొండ శ్రావణ్, వార్డు ఆఫీసర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# మంచి నీళ్లకు గోస పడ్డ విఠలాపూర్ లో మండు టెండల్లో గోదావరి జలాల కాలువ పారుతుంది

విఠలాపూర్ కు కాళేశ్వరం నీళ్లు వచ్చాయి. దసరా కు రైలు రాబోతుంది

అభివృద్ధి లో విఠలాపూర్ ఆదర్శం గా నిలుపుకున్నాం

చౌడాలమ్మ దయతో అన్నింటా.. అందరికి మంచి జరగాలి

చిన్నకోడూర్ మండలం విఠలా పూర్ గ్రామం లో జరిగిన చౌడాలమ్మ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు





**అక్షర కలం సిద్దిపేట మే 09:**

చిన్నకోడూరు మండలం విఠలా పూర్ గ్రామం లో చౌడాలమ్మ విగ్రహా ప్రతిష్ట కార్యక్రమం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతు పదేళ్ల లో విఠలా పూర్ గ్రామ రూపు రేఖలు మారాయని, కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా రంగనాయక సాగర్ ద్వారా గ్రామం లోని అనంతమ్మ కుంటకు నీళ్లు ఇచ్చి జలహారతి పట్టిన నాటి నుండి నెటి వరకు కుంట ఎండుడు లేదు. 100 బోర్లు వేసిన నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. మంచి నీళ్ల కు గోస పడ్డ విఠలా పూర్ గ్రామం మండు టెండల్లో కాలువల్లో గోదావరి జలాలు పారుతున్నాయి. ఆ నీళ్లతోనే బంగారం ల పంటలు పండుతున్నాయి. మూడు దిక్కుల మూడు పంటలు పండుతున్నాయి. గంగా పూర్ విఠలాపూర్ కి రూ. 7కోట్లతో డబుల్ రోడ్డు వేసుకున్నాము. రంగాయ్ పల్లి నుండి గోడాన్ మీదుగా మాచాపూర్ రోడ్డు మంజూరు చేసుకున్నాం. గ్రామం లో అన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేసుకున్నాం పార్క్ చేసుకున్నాం. బడి బాగు చేసుకున్నాం అన్నీ కుల సంఘాలకు భవనాలు కట్టుకున్నాం, గుడి కట్టుకున్నాం. బడి కట్టుకున్నాం అన్నీ బాగు చేసుకున్నామన్నారు. విఠలా పూర్ కు కాళేశ్వరం నీళ్లు తెచ్చిన దసరా కు రైలు కూడా తెస్తా. విఠలా పూర్ లో రైలు ఎక్కుతే హైదరాబాద్ , తిరుపతి కి పోవచ్చు. ఇలా గ్రామానికి అన్నీ చేసుకున్నాం అభివృద్ధి లో ఆదర్శంగానిలుపుకున్నామన్నారు. గ్రామం లో కూరగాయలు కూడా సాగు చేస్తున్నారని చాలా సంతోషమని చెప్పారు. చౌడాలమ్మ గుడి కి బోర్ వేపించిన గుడి కి మొత్తం బండలు వేపించిన ఆర్థిక సహాయం కూడా అందించినన్నారు. ఇలా అమ్మ దయ ఉంటే అన్నీ జరుగుతాయి. అమ్మ దీవెన తో భవిష్యత్ లో గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ సందర్బంగా యాదవ సంఘం సభ్యులు హరీష్ రావుని సన్మానించారు.

# జగదాంబ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది---- చింత ప్రభాకర్



**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

కొండాపూర్ మండలం శివన్న గూడెం తండాలోని జగదాంబ సేవాలాల్ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు తండా ప్రజలు, యువకులు లంబాడ సంప్రదాయ వస్త్రధారణతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లంబాడ సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తండాలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం, మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో తండా ప్రజలు తనకు మంచి మెజార్టీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ, తండా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. అలాగే జగదాంబ సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కూడా తన వంతు సహాయం అందిస్తానన్నారు. జగదాంబ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద్, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, మల్లేశం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ

**అక్షర కలం సిద్దిపేట మే 09:**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త మైపాల్ రెడ్డి అన్న కొడుకు పెళ్లికి ముఖ్యఅతిథిగా సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీ పూజల గోపి కృష్ణ విచ్చేసి వధూవరులను శు భాకాంక్షలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి,కలిముద్దీన్,మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, ఎర్ర మహేందర్, టి ఎమ్ పి ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజ్,మనోహర్,జనార్ధన్, ప్రవీణ్,అశోక్,పాతకోట రమేష్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.

# నేటి నుండి ఘనంగా 74 అడుగుల శ్రీ చింతగుట్ట గరుడ ఆంజనేయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు

**అక్షర కలం సిద్దిపేట మే 09:**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని తిమ్మాయిపల్లి, కోనాయిపల్లి , కొండపాక మండలం లోని బందారం మూడు గ్రామాల శివారులో వెలసిన శ్రీ గరుడా ఆంజనేయ స్వామి దేవాలయంలో 74 అడుగుల ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు నేటి నుండి మూడు రోజులపాటు ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుంది అని వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆలయ ధర్మకర్త బెజగం నర్మదా రవీంద్ర ప్రసాద్ తెలిపారు. ఈకార్యక్రమంలో మే 10వ తేదీన మొదటి రోజు ఆదివారం ఉదయం 7 గంటల 30 నిమిషాలకు గణపతి పూజ, పుణ్యా వచనం నందిముఖం ధ్వజరోహణం ,యాగశాల ప్రవేశం , వాస్తు క్షేత్రపాలక సర్వతో భద్ర మండల ఈశాన్య నవగ్రహ స్థాపన అగ్ని ప్రతిష్ట , తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయి, మే 11 న రెండవ రోజు సోమవారం ఉదయం 7.30 నిమిషాలకు గణపతి పూజ పంచ వ్యాఖ్య పుణ్య వచనం మండపస్థితి , ఆహ్వాయిత దేవత పూజానం, మన్యసూక్త హోమం ,నవగ్రహ హోమం ,స్థాపితం, మండలం తీర్థప్రసాద్ వితరణ కార్యక్రమాలు, చివరి రోజైనా మే 12 న మంగళవారం రోజు గణపతి పూజ, పంచ వాక్య పుణ్య వచనం, అష్టదశ కలశ, అభిషేకం, అలంకరణ , బలిదానం పూర్ణాహుతి ,అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం 4 .00 గంటలనుండి మూడు గ్రామాల్లో విగ్రహం ఒంటిపై మరియు గుర్రం రథం శోభాయాత్ర తో పాటు ,బైక్ ర్యాలీ దేవస్థానం నుండి కోనాయిపల్లి భాష గూడెం తిమ్మాయిపల్లి బంగారం నుండి దేవస్థానం వరకు పెద్ద ఎత్తున శోభాయాత్ర జరుగును కావున మూడు గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త బెజగం నర్మదా రవీంద్ర ప్రసాద్ కోరారు కోరారు. ప్రపంచంలోనే ఏకశిలపై హనుమాన్,గరుత్మంతుడు ఆలయం వందల సంవత్సరాల క్రితం ప్రపంచంలోనే ఏకశిలపై హనుమంతుడు, గరుత్మంతుడు సహజ సిద్ధంగా వెలసిన ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీ గరుడ ఆంజనేయ దేవాలయం, ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయం భక్తుల మొక్కిన మొక్కలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి. ఈ ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు రావడం జరుగుతుంది.

### తెలంగాణలోని అతిపెద్ద 74 అడుగుల గరుడ ఆంజనేయ విగ్రహం









ఈ ఆలయం లో ప్రత్యేకంగా తెలంగాణలోని మొట్టమొదటి 74 అడుగుల హనుమాన్ విగ్రహం నిర్మించి 1 సంవత్సరం క్రితం ప్రాణప్రతిష్ట చేయడం జరిగింది. ఈ చింతగట్టు గరుడా ఆంజనేయ ఆలయం సిద్దిపేట జిల్లాలో నే ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి పొందింది . తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామిని దర్శించడం జరుగుతుంది. కోరిన కోరికలు తీర్చే ఆలయంగా ప్రసిద్ధి పొందింది. ఈఆలయంలో శ్రీ గరుడ ఆంజనేయ స్వామి తోపాటు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కూడా బండ సొరికేలో వెలవడం జరిగింది. ఈ ఆలయంలో పూర్వం రోజుల్లో మునులు తపస్సు చేసేవారని గ్రామ పెద్దలు చెప్పుకుంటారు. ఈ ఆలయానికి క్షేత్ర పాలకునీ గా పెద్ద నాగుపాము ప్రతి అమావాస్య, పున్నమికి ఆలయంలో ప్రాంగణంలోకి రావడం జరుగుతుందని గ్రామ ఆలయ పెద్దలు చెప్తుంటారు. 41 రోజుల గా హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమాలు

ఈ ఆలయ ప్రాంగణంలో41 రోజులు హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు 400 నుండి 500 వరకు స్వాములకు ఘనంగా అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ హనుమాన్ దీక్ష అన్నదాన కార్యక్రమంలో భక్తులు జిల్లాలోని అనేక గ్రామాల నుండి, వివిధ జిల్లాల నుండి హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ఇప్పటివరకు దాదాపుగా 10000 మంది పైచిలుకు హనుమాన్ దీక్ష స్వాములకు అన్నప్రసాద్ వితరణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని ఆలయ ధర్మకర్త నర్మద-రవీంద్ర ప్రసాద్ తెలిపారు. ఆలయ రూపురేఖలు మార్చేసిన భక్తుడు ధర్మకర్త బెజగం నర్మదా- రవీంద్ర ప్రసాద్ వందల సంవత్సరాల క్రితం మూడు గ్రామాల సరిహద్దులో చింతగుట్ట పైన వెలసిన శ్రీ గరుడా ఆంజనేయ దేవాలయం , శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బెజగం రవీంద్ర ప్రసాద్ భార్య డెలివరీ సమయంలో రవీంద్ర ప్రసాద్ తల్లిగా భాగ్యమ్మ కోడలు డెలివరీ మంచి జరగాలని ఆంజనేయస్వామికి ముడుపు కట్టడం జరిగింది. ముడుపు కట్టిన 15 సంవత్సరాల తర్వాత బెజగం నర్మదా రవీంద్ర ప్రసాద్ ఆలయానికి వచ్చి ఆలయ అప్పటి పరిస్థితులను గమనించి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. రవీంద్ర ప్రసాద్ స్నేహితుల సహకారంతో పరిచయస్తుల సహకారంతో ,పలువురు దాతుల సహకారంతో కోట్ల రూపాయలు వెచ్చించి ఆలయరూ రూపురేఖలను మార్చేశాడు. దీనితో ఆలయం ఎప్పుడు తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన హనుమాన్ దేవాలయంగా గుర్తింపు పొంది.

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి.....

- ప్రభుత్వం రైతు పక్షపాతి....

- మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు....

**మెదక్ /కొల్చారం మే09( అక్షర కలం):-**



చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ నగేష్,వ్యవసాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ధాన్యం చివరి గింజలకు కొనాలని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఆలస్యం అవుతుందని, రైస్ మిల్లులో హమాలీల సమస్యను పరిష్కరించుకోవాలని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారు తెలుపాలని అధికారులపైఆగ్రహించారు. రైతులు ధాన్యం తరలింపు పై రోడ్లపైకి వచ్చిన సంఘటన, ధర్నాలు చేసిన విధానం, రైతు పెట్రోల్ బాటిల్ తో రోడ్ల పైకి వచ్చారు ఇలాంటి సంఘటనకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనచేయాలన్నారు. తమది రైతు ప్రభుత్వమని, రైతు సమస్యలపై తప్పకుండా గళం ఎత్తుతామన్నారు. ముఖ్యమంత్రి ,మంత్రులు 24 గంటలు రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు వివరించారు. తాను ప్రజలు, రైతులు ఎన్నుకుంటే వచ్చానని వారికోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలను స్పీడ్ అప్ చేయాలని అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ సజావుగా నిర్వహిస్తామని, హమాలీల సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామన్నారు. నాలుగైదు రోజుల్లో మరింత స్పీడ్ అప్ చేసి రైస్ మిల్లుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధికా భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన-2027 విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి....- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.....

**మెదక్/కొల్చారం మే09(అక్షరకలం):-**

జనగణన-2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రజల్లో అవగాహనకల్పిస్తున్నామన్నారు. దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన అత్యంత కీలకమని తెలిపారు. మే 10, రాత్రి 12.00 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ముగియనున్నందున ప్రతి ఒక్కరు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. 11 నుండి జనగణన ఇంటింటి సర్వే ఉంటుందని ప్రతి ఒక్కరు సహకరించాలనితెలిపారు. ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే విధానమే సెల్ఫ్ఎన్యుమరేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, వనరుల పంపిణీ, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనగణన సమాచారం కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజలు సరైన వివరాలను నమోదు చేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించడం లో కూడా జనగణనఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరు ఈ జనగణనను తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.



# ఎంపీ వద్దిరాజు నూతన వధూవరులకు ఆశీస్సులు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు ఆకాంక్ష-నిఖిల్ రెడ్డిలకు తన ఆశీస్సులు అందజేశారు. ఉంద్యాల హన్మంతరెడ్డి-వసంత దంపతుల ఏకైక కుమార్తె ఆకాంక్ష పెళ్లి లొంకల్ పల్లి వాస్తవ్యులు లింగరెడ్డిగారి శ్రీధర్ రెడ్డి-రజిత దంపతుల ఏకైక కుమారుడు నిఖిల్ రెడ్డితో శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ శంషాబాద్ మైఫేర్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ పెళ్లికి ఎంపీ రవిచంద్ర హాజరై అక్షింతలు వేసి నూతన వధూవరులు ఆకాంక్ష-నిఖిల్ రెడ్డిలను ఆశీర్వదించారు, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



## పరిశ్రమలతో గ్రామ యువతకు ఉపాధి

గ్రామాభివృద్ధిని అడ్డుకోవద్దు

కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్



**సంగారెడ్డి ప్రతినిధి,అక్షర కలం..**

కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామ అభివృద్ధిని అడ్డుకునేందుకు కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం కుట్రలు చేస్తున్నారని, అలాంటి చర్యలను ఏ మాత్రం సహించేది లేదని కాంగ్రెస్ సేవాదళ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్ స్పష్టం చేశారు.శనివారం తొగర్‌పల్లి గ్రామంలో తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.418 సర్వే నెంబర్‌లోని 44 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీ ఐఐసీ ద్వారా ప్రైవేట్ పరిశ్రమకు కేటాయించారని తెలిపారు. గత పాలకులు పల్లె ప్రకృతి వనం, డంప్ యార్డ్ కోసం 7 ఎకరాలు, 3 ఎకరాల్లో బీరప్ప దేవాలయం, ఈద్గా, చర్చిల నిర్మాణం కోసం కేటాయింపు జరిగిందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ తీర్మానాలు, ప్రొసీడింగ్స్ కాపీలు ఇవ్వకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పుడున్న పాలకవర్గం తీర్మానాలు చేసిందని తెలిపారుప్రస్తుత పాలకవర్గం పరిశ్రమకు సంబంధించి గ్రామం పెట్టిన డిమాండ్లను పరిష్కరిస్తామని, దేవాలయాలకు దారి కల్పిస్తామని, గ్రామ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.గత పాలకవర్గం 418 సర్వే నెంబర్‌లోని 2 ఎకరాల భూమిని కొండాపూర్ సొసైటీ భవనానికి ఎందుకు కేటాయించారో గ్రామ ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.పరిశ్రమకు సంబంధించిన భూ కేటాయింపు మంజూరు పత్రాలు, అనుమతి పత్రాలను 15 రోజుల్లో గ్రామపంచాయతీకి అందజేస్తామని పరిశ్రమ యజమాన్యం హామీ ఇచ్చిందని అన్నారు.గ్రామ పరిధిలో వచ్చిన పరిశ్రమలో తొగర్‌పల్లి గ్రామస్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పక్క గ్రామాల పెత్తనం సాగనీయమని స్పష్టం చేశారు.తాము పెట్టిన డిమాండ్లు పరిష్కరించకపోతే, గ్రామస్తులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోతే సర్పంచిగా రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రశాంత్ గౌడ్ హెచ్చరించారు.ఈ సమావేశంలో ఉప సర్పంచ్ వినయ్, నాయకులు శంకర్, సామెల్, సందీప్, ఆనంద్, రవి పాల్గొన్నారు.

## భక్తాంజనేయ స్వామి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి

జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగిన పాలమాకుల గ్రామం



**అక్షర కలం సిద్దిపేట మే 09:**

సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారిని వంగ రాజేశ్వర్ రెడ్డి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం హనుమాన్ దీక్ష స్వాములతో కలిసి నిర్వహించిన బిక్ష కార్యక్రమంలో పాల్గొని స్వాములతో ఆధ్యాత్మికంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా హనుమాన్ స్వాములు "జై శ్రీరామ్" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని భక్తిరసమయం చేశారు.కాషాయ వస్త్రధారణలో ఉన్న దీక్ష స్వాములతో కలిసి వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొనడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తి, శక్తి, ఐక్యతకు ప్రతీకగా సాగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది. అభయాంజనేయ స్వామి కృపతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆయన ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వర్షం చూసిన ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**అక్షర కలం సిద్దిపేట మే 09:**

ఎమ్మెల్యే హరీష్ రావు ఆదేశానుసారం ఈరోజు పిఎసిఎస్ పాలమాకుల అధ్యక్షులు శ్రీ ఎల్లంకి మహిపాల్ రెడ్డి , నాగరాజుపల్లి, ఖానాపూర్ మరియు నర్మెట్ట గ్రామాలలో పి.ఎ.సి.ఎస్ ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు సెంటర్లను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ లారీల కొరత ఉన్నందున ఎమ్మార్వో, ఆర్.ఐ మరియు ఎస్.ఐ ఆధ్వర్యంలో రాంపూర్ క్రాస్ వద్ద లారీలను ఆపి ఎక్కడ లారీల అవసరం ఉన్నాయో అక్కడికి పంపాలని చెప్పారు. ఈ నాలుగు రోజులు ఎక్కువ ధాన్యం ఉంటుంది, కావున కీలకంగా పనిచేయాలని హమాలీలను, సెంటర్ ఇన్చార్జిలకు తెలిపారు. వర్షాలు వచ్చే సూచన ఉన్నందున ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మొగ్దుంపూర్ సర్పంచ్ పాకాల శ్రీను, నాగరాజుపల్లి సర్పంచ్ ముకెర వాసర యాదిమల్లు,దుబ్బుడు శ్రీకాంత్ రెడ్డి,మరియు హమాలీలు, రైతులు పాల్గొన్నారు.

# కటిక చీకట్లో కారు దీపం లాంటిది కాళేశ్వరం ప్రాజెక్టు

కాళేశ్వరాన్ని కించపరిస్తే, ముక్తేశ్వరుడి శిక్ష తప్పదు తస్మాత్ జాగ్రత్త..

మేడిగడ్డ మరమ్మతులు చేతగాక, తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ డ్రామాలు.

150 మీటర్లకు ఒప్పందం జరిగితే కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో తట్టెడు మట్టైనా ఎందుకు తీయలేదు?

కాంగ్రెస్ మంత్రులకు ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదు.. ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు.

పక్క రాష్ట్రాలకు బహిరంగ లేఖలు రాస్తూ రెచ్చగొట్టడం మానేసి, కేసీఆర్ లా ఆ రాష్ట్రాలను మెప్పించి తెలంగాణ ప్రయోజనాలు సాధించడం నేర్చుకోండి.

ఎల్ నినో ముప్పుతో రాబోయే కరువును ఎదుర్కోవాలంటే, తక్షణమే మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్లు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలి.

బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్.

**అక్షర కలం సిద్దిపేట మే 09:**

తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, బీఆర్ఎస్ పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కోవాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్స్‌నిన్న ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రుల హడావిడి చూసిన తర్వాత ఒక విషయం అర్థమవుతోంది.పని తక్కువ ప్రచారం ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వాగుడు తప్ప చేతలు శూన్యం.ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని తెలిసినప్పుడు హడావిడిగా బాయి తవ్వినట్లు కాకుండా, ముందస్తుగా మేడిగడ్డ రిపేర్లు చేయాలి.కానీ దాన్ని వదిలేసి తమ్మిడిహట్టి కడుతున్నట్లు పేపర్లకు ఫోజులిస్తున్నారు. కురచ బుద్ధితో బీఆర్ఎస్ పై బురద జల్లే కార్యక్రమం తప్ప వారు చేస్తున్నది శూన్యం.150 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఒక మంత్రి హోదాలో ఉండి ప్రజలు ఏమనుకుంటారన్న సోయి లేకుండా ఇంత పిచ్చి అబద్ధం మాట్లాడొచ్చా.నిజంగానే ఒప్పందం ఉంటే, ఉమ్మడి రాష్ట్రంలో ఏడున్నరేండ్లు అధికారంలో ఉండి కూడా తట్టెడు మట్టైనా ఎందుకు తవ్వలేదు?ఈ రెండున్నరేళ్లుగా డ్రామాలు చేస్తూ పనులు ఎందుకు స్టార్ట్ చేయలేదు? 30 నెలలుగా కాంగ్రెస్ పార్టీని ఎవరు ఆపారు.ఆరోజు మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్



చవాన్ అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. మాతో ఒప్పందం లేకుండా ఏకపక్షంగా పనులు చేస్తున్నారు, ఇవన్నీ నిర్వీర్యం అయిపోతాయి, మీరు ఏ పని చేసినా అది వృధా అవుతుంది అని స్పష్టంగా చెప్పారు.కానీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు అగ్రిమెంట్ అయిపోయిందని పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. కిరణ్ కుమార్ రెడ్డి ఉన్నప్పుడే అగ్రిమెంట్ అయి ఉంటే తమ్మిడిహట్టి దగ్గర పనులు ప్రారంభించకుండా.. తోక పనులను ఎందుకు ప్రారంభించారు? చేవెళ్ల దగ్గర ఎందుకు తవ్వారు.మేం మంత్రులం ఏం మాట్లాడినా ప్రజలు నమ్ముతారని అతి విశ్వాసంతో వాళ్లు మాట్లాడుతున్నట్లుంది. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కడితే గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు పోతాయి అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటున్నాడు. కనీస అవగాహన లేకుండా మాట్లాడి ఆయన తన అవివేకాన్ని బయటపెట్టుకున్నాడు.మొన్న హైదరాబాద్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ కట్టి సుందిళ్ల బ్యారేజ్ కి నీళ్లు తెస్తాం అంటారు.సీఎం రేవంత్ రెడ్డి ఏమో తమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లికి లిఫ్టుతో నీళ్లు తెస్తామంటాడు. మంత్రి జూపల్లి ఏమో లిఫ్ట్ అవసరం లేదు. గ్రావిటీ ద్వారా వస్తాయి అంటారు. ఎవరు చెప్పేది నిజం.ఈ అజ్ఞానపు మాటలతో రాష్ట్ర పరువు తీస్తున్నారు.150 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ కట్టడానికి మహారాష్ట్రను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒప్పించాలని మొన్న సీఎం అంటారు. మరి 150 మీటర్లకు అప్పుడే అగ్రిమెంట్ జరిగిందని మంత్రి వివేక్ అంటున్నాడు కదా. అగ్రిమెంట్ జరిగి ఉంటే మళ్లీ మహారాష్ట్రను ఒప్పించడం ఎందుకు?రాష్ట్ర ప్రయోజనాలు రేవంత్ రెడ్డికి పట్టవు. పక్క రాష్ట్రంలో వేరే ప్రభుత్వం ఉన్నప్పుడు వారితో చర్చించి, మెప్పించి మన ప్రయోజనాలు కాపాడుకోవాలి.కానీ రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే తీరుతో కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తే మహారాష్ట్ర ప్రభుత్వంఅంగీకరిస్తుందా.2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే కేసీఆర్ నాయకత్వంలో నీటిపారుదల శాఖ మంత్రిగా నేను, అధికారులు మహారాష్ట్రకెళ్లి అక్కడి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశాం.కేసీఆర్ తన పుట్టినరోజు నాడే రాష్ట్ర ప్రయోజనాల కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రితోసమావేశమయ్యారు. ఒక రాష్ట్రాన్ని ఒప్పించే పద్ధతి ఇది. మీలా లేఖలు రాయడం కాదు. తమ్మిడిహట్టి వద్ద ఎకో సెన్సిటివ్ జోన్ ఉంది, వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ ఉంది. సుప్రీంకోర్టు తీర్పు రావాలి. ఈ సాధకబాధకాలు తీర్చకుండా.. మేనిఫెస్టోలో పెట్టి డైలాగులు కొట్టడం తప్ప కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు 2024-25 బడ్జెట్లో పెట్టింది 2 కోట్లు, 2025లో 30 కోట్లు, ఈ ఏడాది 50 కోట్లు. మొత్తం 82 కోట్లతో ప్రాజెక్టు పూర్తవుతుందా?మీరు మాటల కోసమే తప్ప చేతల కోసం కాదు. మీకు చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో ఎందుకు సరైన నిధులు కేటాయించలేదు?ఆరోజు ఢిల్లీలో, మహారాష్ట్రలో, ఏపీలో మూడు చోట్లా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రాణహిత చేవెళ్లను కట్టకుండా సమయం వృధా చేశారు.నాలుగేళ్లలో పూర్తి చేస్తామని మాట ఇచ్చి ఏడున్నరేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా, కనీస సర్వే లేకుండా మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద రూ. 2300 కోట్లు బిల్లులు లేపారు. కరప్షన్ అనేది కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉంది. కాంగ్రెస్ హయాంలో ప్రాణహిత వి చేవెళ్ల పనులకు, ల్యాండ్ అక్విజిషన్ కు ఖర్చు చేసింది రూ. 3780 కోట్లు. కానీ నిన్న రేవంత్ రెడ్డి 11 వేల కోట్లు పూర్తయ్యాయి అని పచ్చి అబద్ధం చెబుతున్నారు.

తమ్మిడిహట్టి దగ్గర నీళ్లు లేవు, ప్రత్యామ్నాయం చూసుకోవాలని కేంద్ర జలవనరుల శాఖలోని అన్ని విభాగాలు చెప్పాయి.ఆనాటి కేంద్ర మంత్రి ఉమాభారతి రాసిన లేఖలో మూడో పేజీలో ఉన్న నీళ్లు లేవు అన్న విషయాన్ని దాచిపెట్టి, సగం లేఖను మాత్రమే చూపిస్తూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేసింది.ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత చేవెళ్లకు శంకుస్థాపన చేస్తేఅది జలయజ్ఞం కాదు, ధనయజ్ఞం అని విమర్శించిన రేవంత్ రెడ్డి, ఈరోజు అదేప్రాజెక్టుగురించిగొప్పగామాట్లాడుతున్నాడు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు ఒక్కో పార్టీలో ఒక్కో మాట మాట్లాడటం ఆయన నైజం. ఈ మండుటెండల్లో ఈ నిమిషానికి మేడిగడ్డ వద్ద 6400 క్యూసెక్కుల నీళ్లు కిందకి వెళ్ళిపోతున్నాయి.

కానీ తమ్మిడిహట్టి వద్ద కేవలం 2000 క్యూసెక్కులు మాత్రమే పోతున్నాయి. 2 వేలు ఎక్కడ? 6400 క్యూసెక్కులు ఎక్కడ? మేడిగడ్డ వద్ద 500 బోర్లు వేయాల్సి ఉంటే మీరు కనీసం 5 బోర్లు కూడా వేయలేదు. ఆ రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే కేసీఆర్ కి ఎక్కడ పేరు వస్తుందో అన్న అక్కసుతోనే పనులు ఆపుతున్నారు.వచ్చే సంవత్సరం ఎల్ నినో వల్ల దేశమంతా కరువు వస్తుందని సైంటిస్టులు చెబుతున్నారు. కటిక చీకట్లో కారు దీపం లాంటిది కాళేశ్వరం ప్రాజెక్టు. ఎంత కరువొచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే స్థలం మేడిగడ్డ. కేసీఆర్ ముందు చూపుతో తెలంగాణ తాగు,సాగునీటి అవసరాల కోసం ఇంజనీర్లతో చర్చించి ఈ ప్రాజెక్టు కట్టారు. కాళేశ్వరాన్ని తక్కువ చేసి మాట్లాడితే, అది కేసీఆర్ ని తక్కువ చేసినట్లు కాదు తెలంగాణ రాష్ట్రానికి, తెలంగాణ జాతికి మీరు చేస్తున్న ద్రోహం. తెలంగాణ నీటి హక్కులకు అన్యాయం చేయకండి. కాళేశ్వరాన్ని కించపరిస్తే, అందులో కొలువైన ముక్తేశ్వరుడు మీకు కచ్చితంగా శిక్ష వేస్తాడు, తస్మాత్ జాగ్రత్త.కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా తమ్మిడిహట్టి జలహారతుల డ్రామాలు కట్టిపెట్టి, వెంటనే మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మతులు చేసి రాష్ట్ర రైతాంగానికి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తున్నాను. అని అన్నారు.

## పురిటి నొప్పులతో నవ మాసాలు మోసి జన్మనిచ్చిన.... - శిశు విక్రయాలు జరిపితే ఎంతటి వారైన ఊరుకునేది లేదు..

- ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవు....
- సమగ్ర విచారణ జరిపి ఏ పార్టీ వారైన చర్యలు తీసుకోవాలి.....
- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్.....

**మెదక్/కొల్చారం మే09(అక్షరకలం):-**



నవ మాసాలు మోసి, పురిటి నొప్పులతో బాధపడి బిడ్డకు జన్మనిచ్చిన తల్లులకు విషాదం నింపే విధంగా ఆసుపత్రి సిబ్బంది వ్యవహరిస్తే ఏ పార్టీ వారైనా ఎవరిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. మెదక్ పట్టణంలో ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనివ్వగా చనిపోయింది అంటూ ప్రైవేట్ ఆస్పత్రికి సిబ్బంది ఆడ శిశువును ఇతరులకు అమ్ముకున్న ఘటనపై ఎమ్మెల్యే రోహిత్ తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే బాధ్యులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు జరిగితే ఏ పార్టీ వారైన ఎంతటి అధికారులు తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మానవత్వం మంటగలిగే విధంగా వ్యవహరించిన ఆసుపత్రికి సిబ్బంది ప్రవర్తించిన తీరు నాకెంతో బాధ కలిగించిందన్నారు. నవ మాసాలు మోసిన ఆ కన్నతల్లి సంతోషం లేకుండా కన్నీళ్లు మిగిల్చిన వారిని వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. ఈ ఘటనకు పాల్పడిన బాధ్యులు ఎవరైనా వారిని కఠినంగా శిక్షించాలని ఆయన పునరుద్ధరించారు.

## సన్ రైస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

సన్రైజ్ హాస్పిటల్, సన్రైస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం, ఉచిత కార్డియాలజీ క్యాంపును నిర్వహించారు. హాస్పిటల్ అధినేత స్వామి గౌడ్ పుట్టిన రోజు పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎండి సంతోష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి లోని మీడియా ప్రతినిధులు,అలాగే సుమారు 300 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత స్వామి గౌడ్ మాట్లాడుతూ తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం సంతోషకరమని అలాగే కార్డియాక్ సేవలను ఇటీవలే ప్రారంభించామని సంగారెడ్డి పరిసర ప్రాంత ప్రజలు మా సేవలను వినియోగించుకోవాలని కోరారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు, హాస్పిటల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955